www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విశాఖపట్నం

జన కేతనం

- ఒక్క చాన్స్‌కే... చుక్కలు చూపించారు
- పార్టీ ఇచ్చిన జెండాలు.. రెండు వాహనాలు!
- బరిలో ఆరుగురే...

...వార్తలు 3వ పేజీలో

వైసీపీ దౌర్జన్యకాండ

డిప్యూటీ సీఎం బూడి స్వగ్రామం తారువలో ఉద్రిక్తత

- జెండా ఎగురవేసినందుకు బీజేపీ కార్యకర్తపై ముత్యాలనాయుడు అనుచరుల దాడి
- పరామర్శించడానికి వచ్చిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై కూడా ప్రతాపం
- వాహనాన్ని ధ్వంసం చేసి వీరంగం
- బాధితులపైనే తిరిగి పోలీసులకు ఫిర్యాదు
- పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సీఎం రమేశ్ ఆరోపణ
- భారీగా పోలీసుల మోహరింపు



తారువలో సీఎం రమేశ్‌ను అడ్డుకుంటున్న వైసీపీ కార్యకర్తలు



వైసీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన సీఎం రమేశ్ వాహనం (ఇన్‌సెట్‌లో) తోపులాటలో సీఎం రమేశ్ చొక్కా చిరిగిపోయిన దృశ్యం

దేవరాపల్లి, మే 4:

డిప్యూటీ సీఎం, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు స్వగ్రామమైన మండలంలోని తారువలో శనివారం వైసీపీ నాయకులు చెలరేగిపోయారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ నాయకులపై దాడి చేశారు. కార్యకర్తను పరామర్శించేందుకు వచ్చిన సీఎం రమేశ్‌పై కూడా బూడి ముత్యాలనాయుడు వర్గీయులు దాడికి తెగబడడం, ఆయన వాహనాన్ని ధ్వంసం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది.

తారువలో శనివారం కూటమి ఎంపీ అభ్యర్థికి మద్దతుగా జెండా ఎగురవేసేందుకు యత్నించిన బీజేపీ కార్యకర్త గంగాధర్ (ముత్యాలనాయుడు బావమరిది)తో పాటు మరో ముగ్గురిపై బూడి ముత్యాల నాయుడు వర్గీయులు దాడి చేయడమే కాకుండా వారిపై తిరిగి దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఎన్నికల ప్రచారం చేస్తుంటే తమపైనే బూడి వర్గీయులు దాడి చేసి తమ ఇంటిని ధ్వంసం చేసి తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని బాధితుడు గంగాధర్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు అధికార పార్టీ నేతలకు అండగా వ్యవహరిస్తున్నారని, దాడి ... మిగతా 4వ పేజీలో

జగనాసుర పాలనను అంతమొందించండి

ఓటు అనే ఆయుధం ఉపయోగించండి

- నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ పిలుపు

మాట్లాడుతున్న బాలకృష్ణ



ఎలమంచిలి సభకు హాజరైన ప్రజానీకం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి నిల్
- రైతులను, నిరుద్యోగులను మోసం చేశారు
- ఎస్సీ, ఎస్టీలకు పథకాలను రద్దు చేశారు
- వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి
- ఎలమంచిలి, కొత్తకోటల్లో రోడ్డు షో
- అడుగడుగునా ప్రజల ఘన స్వాగతం

రావికమతం/ఎలమంచిలి, మే 4:

రాష్ట్రంలో జగనాసుర పాలనను ఓటు అనే ఆయుధంతో అంతమొందించాలని ప్రజలకు నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన అనకాపల్లి జిల్లా ఎలమంచిలి, రావికమతం మండలం కొత్తకోట గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. బాలకృష్ణకు అడుగడుగునా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పెద్దఎత్తున పూల వర్షం కురిపించారు. జై బాలయ్య, జై చంద్రబాబు, జై టీడీపీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ... మిగతా 4వ పేజీలో



తాళ్లపాలెంలో మోదీ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసులు

ప్రధాని మోదీ జిల్లా పర్యటన రేపు

- హాజరుకానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్
- తాళ్లపాలెంలో ప్రచార సభకు ఏర్పాట్లు



అనకాపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. టీడీపీ, జనసేన బలపరిచిన బీజేపీ అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థి సీఎం రమేశ్ ఆధ్వర్యంలో కశింకోట మండలం తాళ్లపాలెంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఎన్నికల ప్రచార సభకు మోదీ హాజరుకానున్నారు. కూటమి ఏర్పడిన తరువాత మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న నేపథ్యంలో భారీగా జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు ప్రధాని మోదీతో పాటు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. తొలిసారిగా జిల్లాకు ప్రధాని మోదీ వస్తుండడంతో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ప్రధాని సభ విజయవంతానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. తాళ్లపాలెం జాతీయ రహదారికి సమీపంలో సుమారు 80 ఎకరాల లేఅవుట్‌ను ప్రధాని మోదీ సభ కోసం సిద్ధం చేస్తున్నారు. కేంద్ర పోలీసు బలగాలు భద్రతా చర్యల్లో భాగంగా ఇప్పటికే మోదీ సభా ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్స్‌కవేటర్లను వినియోగించి సభ నిర్వహించే స్థలాన్ని చదును చేస్తున్నారు. సభా వేదికకు సమీపంలోనే హెలీప్యాడ్‌తో పాటు ప్రజలు వచ్చేందుకు బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. వేదికతో పాటు ప్రజలు, వీఐపీలు, టీడీపీ, జనసేన, బీజేపీ ప్రతినిధులు, మీడియా గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీ జిల్లాకు వస్తున్న నేపథ్యంలో అశేషంగా ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కోరారు.

9 గంటల కరెంట్ ఉత్తిమాటే..



చోడవరం, మే 4:

వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు నాణ్యత గల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం.. దానిని అమలు చేయడంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారని, అది కూడా రెండు విడతల్లో ఉదయం, సాయంత్రం ఇస్తూ ఇందులో కూడా రెండు గంటలు కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలుకాని జగన్ హామీ

- ప్రస్తుతం వ్యవసాయానికి ఏడు గంటలే విద్యుత్ సరఫరా
- అది కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో..
- అందులోనూ అనధికార కోతలు
- పొలం తడవడం లేదంటూ రైతుల ఆవేదన



గత కొన్ని నెలలుగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా దైవాదీనంగా మారింది. విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో, తిరిగి ఎప్పుడు పోతుందో తెలియక పొలాల్లోనే రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు నెలల క్రితం వరకు 9 గంటల పాటు ఒకే విడతలో సరఫరా ఇచ్చేవారు. తరువాత క్రమంగా రెండు విడతలుగా ఉదయం, సాయంత్రం ఇవ్వడం ప్రారంభించారు. ఆ తరువాత నుంచి క్రమంగా విద్యుత్ సరఫరా ఏడు గంటలకు పడిపోయింది. ప్రస్తుతం ఓ రోజు నాలుగు గంటలు, మరో రోజు ఐదు గంటలు చొప్పున సరఫరా అవుతోంది. కొన్ని ఫీడర్లలో సక్రమంగా మూడు గంటల పాటు కూడా విద్యుత్ సరఫరా ఉండడం లేదని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యాన పంటలు వేసిన రైతులతో పాటు చెరకు సాగు చేస్తున్న రైతులకు సైతం సాగునీరు ఎంతో అవసరం. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరకు దవ్వ ఉడుపులకు, అరటి, సరుగుడు, పామాయిల్ తోటలతో పాటు వేరుశనగ, ఇతర ఉద్యాన పంటలు వేసిన రైతులకు సాగునీరు అవసరం ఎక్కువగా ఉంది. దీనికి తోడు పశువులకు అవసరమైన గడ్డి పెంపకానికి కూడా సాగునీరు అవసరం ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండకపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఇళ్లకు కూడా అనధికార కోతలు అమలవుతున్నాయి. ఈ క్రమంలోనే వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అనధికార కోతలు అమలు చేస్తున్నట్టు సమాచారం. దీని వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వ్యవసాయ బోరు

రోజుకు 4 గంటలు కూడా రావడం లేదు



వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చినా ప్రస్తుతం నాలుగు గంటలు కూడా సరఫరా ఉండడం లేదు. ప్రస్తుతం వస్తున్న విద్యుత్‌తో కనీసం రెండు సెంట్ల భూమి కూడా తడవడం లేదు. వేరుశనగ పంటకు సరిగా నీరు అందక నష్టపోయాం. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియక ఇంటికి, పొలానికి తిరుగుతున్నాం. **- పోలిన జనార్థనరావు,** రైతు, పెదపాచిల, రావికమతం మండలం

పొలాలు తడవడం లేదు



వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా ఉండడం లేదు. ఏకధాటిగా కనీసం 4 గంటల పాటు కూడా సరఫరా ఉండడం లేదు. ప్రతిసారీ అంతరాయాలు, ఏదో కారణాలతోనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఇదేమని అడిగితే పైనుంచే కట్ చేస్తున్నామని అంటున్నారు. ఈ విద్యుత్ సరఫరాతో కనీసం ఎకరం పొలం కూడా తడవడం లేదు. **- దోకల దేముడుబాబు,** రైతు, చీడిపల్లి, చీడికాడ మండలం

ఇబ్బందులు తప్పడం లేదు



వ్యవసాయానికి విద్యుత్ సరఫరా దైవాదీనంగా మారిపోయింది. రెండు విడతలుగా ఇస్తున్న కరెంటు ఒక రోజు 4 గంటలు ఉంటే, మరో రోజు 5 గంటలు, ఒక్కో రోజు అది కూడా ఉండడం లేదు. పశువులకు పచ్చగడ్డి పెంచే మడులకు సైతం నీరు చాలడం లేదు. ఏం చేయాలో తోచడం లేదు. ఉచిత విద్యుత్‌ను నమ్మితే సాగు సాగేలా లేదు. ఏడు గంటలైనా ఆటంకాలు లేకుండా, ఒకే విడతలో సరఫరా చేస్తే రైతులకు మేలు చేసిన వారవుతారు. **- సాయం రఘునాథ్,** రైతు, బుచ్చెయ్యపేట

13న కార్మికులకు సెలవు

ఎన్నికల రోజు సెలవు ఇవ్వని వ్యాపారులపై చర్యలు

- కార్మిక శాఖాధికారి హెచ్చరిక

చోడవరం, మే 4:

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈ నెల 13న దుకాణాలు, హోటళ్లు, ఆటోమొబైల్ షాపులు, ఇతర వ్యాపార సంస్థల్లో పనిచేసే కార్మికులకు సెలవు ఇవ్వని వ్యాపారులు, యజమానులకు జరిమానాతో పాటు, కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక కార్మిక శాఖాధికారి పి.సూర్యనారాయణ తెలిపారు. ఎన్నికల రోజున కార్మికుడికి జీతం కోత లేకుండా ఓటు వేసేందుకు వీలుగా సెలవు ఇవ్వాలని, లేని పక్షంలో సంబంధిత యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకవేళ సెలవు ఇవ్వనట్టయితే 9492555018, 9948037377 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయాలని కార్మికులకు ఆయన సూచించారు.

ఎన్నికల ఏర్పాట్లపై సీఈవో ఆరా

- కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన ముకేశ్‌కుమార్ మీనా

అనకాపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా ఎన్నికల ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. అలాగే స్ట్రాంగ్ రూమ్‌తో పాటు కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఎంసీఎంసీ రూమ్‌లో న్యూస్ వాచింగ్, ఫిర్యాదుల విభాగంలో ఏర్పాట్లు, ప్రకటనలు, సర్టిఫికెట్ల మంజూరు, వివిధ టీవీ చానళ్లు, సోషల్ మీడియాలో వస్తున్న స్క్రోలింగ్స్, చేపడుతున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, సన్నద్ధత వివరాలను తెలియజేశారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అధికారులతో మాట్లాడుతున్న సీఈవో ముకేశ్‌కుమార్ మీనా

వచ్చే నెల 18న మాడుగుల మోదకొండమ్మ జాతర

మాడుగుల, మే 4:

ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతరను వచ్చే నెల 18న నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు అయ్యిందని ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు వెల్లడించారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులతో ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర మహోత్సవానికి సంబంధించిన ముహూర్తాన్ని స్థానిక పురోహితుడు భమిడిపాటి శాస్త్రి ప్రకటించారు. జాతరకు సంబంధించి ఈ నెల 10వ తేదీ ఉదయం 9:30 గంటలకు శతకం పట్టు వద్ద ముహూర్తపు రాట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్యనాయుడుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మోదకొండమ్మ అమ్మవారు

బాలయ్యకు బ్రహ్మరథం



ఎలమంచిలిలో నందమూరి బాలకృష్ణ బహిరంగ సభకు హాజరైన అశేష జన వాహిని

ప్రముఖ నటుడు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ అనకాపల్లి జిల్లా ఎలమంచిలి, రావికమతం మండలం కొత్తకోటలో రోడ్ షో నిర్వహించారు. స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో చేపట్టిన రోడ్ షోకు జనం బ్రహ్మరథం పట్టారు. అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అడుగడుగునా మంగళహారతులతో స్వాగతం పలికారు. అభిమానులను ఉత్సాహపరుస్తూ బాలయ్య రోడ్ షో నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

- ఎలమంచిలి/ రావికమమతం



ఎలమంచిలి సభలో విక్టరీ సింబల్ చూపిస్తున్న నందమూరి బాలకృష్ణ



ఎలమంచిలిలో రోడ్ షోకు హాజరైన అభిమానులు, కూటమి శ్రేణులు



ఎలమంచిలి రోడ్ షోలో మాట్లాడుతున్న బాలకృష్ణ. చిత్రంలో పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు విజయకుమార్



రావికమతం: కొత్తకోటలో మాట్లాడుతున్న బాలకృష్ణ. చిత్రంలో మల్లునాయుడు, బత్తుల తాతయ్యబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, తదితరులు



కొత్తకోటలో బాలకృష్ణ రోడ్ షోకు హాజరైన ప్రజలు

క్రైం... crime news

లగిశెట్టిపాలెంలో చోరీ

▸▸ 6 తులాల బంగారం, రూ. 14 వేలు అపహరణ



వేలు ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

సబ్బవరం, మే 4 : మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలో శుక్రవారం రాత్రి ఒక ఇంట్లో 6 తులాల బంగారు వస్తువులు, రూ. 14 వేలు నగదు అపహరించుకుపోయారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లగిశెట్టిపాలెంలో అండిబోయిన చక్రధర్, భార్యతో కలిసి శుక్రవారం రాత్రి 11 గంటల వరకూ ఇంట్లో నిద్రించారు. ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో 11 గంటల తరువాత తలుపు దగ్గరకు వేసి (గడి పెట్టలేదు) ఆవరణలో నిద్రించారు. తెలువారు జామున 5.30 గంటలకు లేచి ఇంటిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా లోపల గడియ పెట్టి ఉంది. రాత్రి గడి పెట్టలేదు కదా.. లోపల ఎవరు గడిపెట్టారని అనుమానం వచ్చి ఇంటి వెనుక వెళ్లి చూడగా, వెనుక తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. బీరువా తెరిచి ఉంది. దీంతో కంగారు పడి పక్క ఇంట్లో ఉన్న తండ్రి కోటిరాజుకు సమాచారం ఇవ్వడంతో వచ్చి బీరువాలో వస్తువులు పరిశీలించగా.. బంగారు వస్తువులు 2 తులాల నక్లెస్, అర తులం చెవి దుద్దులు, పావు తులం ఎత్తుగొలుసు, తులం చైను, ఒకటి ముప్పావు తులాలు బ్రాస్‌లెట్, అర తులం ఉంగరం, రూ. 14 వేలు నగదు కనిపించలేదు. పోలీసులుకు సమాచారం ఇవ్వడంతో సీఐ పిన్నింటి రమణ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియన వ్యక్తులు ముందు గుమ్మం నుంచి ప్రవేశించి చోరీ చేసిన తరువాత వెనుక గుమ్మం నుంచి బయటకు వెళ్లిపోయినట్టు గుర్తించారు. క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలుముద్రలు సేకరించారు. చక్రధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమణ తెలిపారు.

27 ఒడిశా మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ సిబ్బంది

పాడేరు రూరల్, మే 4: మద్యం బాటిళ్లను అక్రమ తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వీవీవీఎస్ శేఖర్‌బాబు తెలిపారు. ఒడిశా ప్రాంతం నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం హుకుంపేట మండలం ఒంటిపాక జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా 27 ఒడిశా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న కంబిడి బాలన్నను అదుపులోకి తీసుకుని, సదరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు ఎం.శేఖరం, దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

2,200 లీటర్ల బెల్లపు పులుసు ధ్వంసం

రావికమతం, మే 4: సారా తయారీకి సిద్ధంగా ఉన్న 2,200 లీటర్ల బెల్లపు పులుసును ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపారు. మండలంలో గుమ్మాళ్లపాడు శివారు బోడిమెట్ట ప్రాంతంలో సారా తయారీ స్థావరాలపై శనివారం సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 10 ప్లాస్టిక్ డ్రమ్‌లతో నిల్వ ఉంచిన బెల్లపు పులుసును ధ్వంసం చేశారు. తమ రాకను పసిగట్టిన సారా తయారీదారులు అక్కడినుంచి పరారయ్యారన్నారు.

పశువులపాక, వరికుప్పలు దగ్ధం

కె.కోటపాడు, మే 4: మండలంలోని కింతాడ శివారు రామచంద్రపురంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదానికి వరికుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామంలో ఇటీవల యూకలిప్టస్ తోటను తొల గించి అక్కడ రాలిన ఆకులకు నిప్పుపెట్టడంతో పక్కనే గల బండారు అప్పలనాయుడుకు చెందిన పశువులపాకకు నిప్పురవ్వలు అంటుకున్నాయి. పాకతోపాటు అక్కడ ఉన్న రెండు వరికుప్పలు, మూడు మామిడిచెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారంమేరకు సబ్బవరం నుంచి అగ్నిమాపక ఎస్ఎఫ్ఓ జీ.వి. సత్యరాజు, లీడింగ్ ఫైర్‌మెన్ కె. రాజారావు, సిబ్బంది ఉదయ్‌కుమా ర్, మహేశ్వరరావు, సత్తిబాబు సకాలంలో వచ్చి మంటలను అదుపు చేశారు.

11 రకాల కార్డులతో ఓటు వేయవచ్చు

అనకాపల్లి కలెక్టరేట్, మే 4: ఏపిక్ కార్డు, ఇతర గుర్తింపు కార్డుల ద్వారా కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని డీఆర్‌ఓ దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, ఎంఎస్ఆర్ఏజీపీ జాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్ పాసు పుస్తకాలు, కార్మిక మంత్రితత్వ శాఖ ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐచే జారీ చేయబడిన స్మార్ట్‌కార్డు, భారతీయ పాస్‌పోర్టు, ఫొటోగ్రాఫ్‌తో ఉన్న పింఛన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పీఎస్‌యూలు, ప్రభుత్వరంగ సంస్థ ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోగ్రాఫ్‌తో ఉన్న సర్వీస్ ఐడీ కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులతో ఓటు హక్కును వేయవచ్చునని తెలిపారు.

ముకుందపురంలో వలంటీర్లు రాజీనామా

మాడుగుల రూరల్, మే 4: మండలంలోని ముకుందపురం పరిధిలోని 11 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ సచివాలయం పరిధిలోని శ్యామల, జ్యోతి, పవన్, సాయి హేమ, తారకేశ్వరరావు, గణపతికుమార్, రమణ, శ్రీదేవి, మధు, యమున, రామకృష్ణ తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి కవితకు అందజేశారు. తమ వ్యక్తిగత, కుటుంబ సమస్యలతో వలంటీరు విధులకు రాజీనామా చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఈ రాజీనామా ప త్రాలను ఎంపీడీవో కాళీప్రసాద రావు అందించడంతో ఆయన ఆమోదించి ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా పింఛనుదారుల సంఘం అధ్యక్షుడిగా శర్మ



జిల్లా ఖజానాధికారి సుభాషిణికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు, మే 4 : జిల్లా పింఛనుదారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బీఎల్ఎన్.శర్మ, కార్యదర్శిగా సీహెచ్.సోమేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు, సహాధ్యక్షులుగా వి.గజ్జాలమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.సాంబమూర్తి, కోశాధికారిగా కె.సత్యారావు, మండల శాఖ సభ్యులుగా ఎస్.బాబూరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం జిల్లా ఖజానాధికారి వి.ఎల్. సుభాషిణిని కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్డాది జగన్నాథరావు, ఉప ఖజానాధికారి జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని'కళ' తప్పిన నెహ్రూచౌక్

- ▸▸ కానరాని ఎన్నికల సందడి
- ▸▸ కనిపించని నేతలు, కార్యకర్తల హడావిడి
- ▸▸ కూడలికి దూరంగా పార్టీ కార్యాలయాలు ఉండడమే కారణం
- ▸▸ టీడీపీ పోటీలో లేకపోవడం కూడా కారణం



అనకాపల్లి ప్రధాన కూడలి నెహ్రూచౌక్

అనకాపల్లి టౌన్, మే 4: నెహ్రూచౌక్.. అనకాపల్లి పట్టణానికి ల్యాండ్‌మార్క్.. ప్రతీ ఎన్నికలకు వివిధ పార్టీల బ్యానర్లు, జెండాలు, నాయకులు, కార్యకర్తలతో కళకళలాడేది. అటువంటి జంక్షన్ ఈసారి ఎన్నికల్లో సందడి కానరావడం లేదు. ఎన్నికల నగరా మోగిన తర్వాత నుంచి కౌంటింగ్ వరకు ఈ కూడలి కోలాహలంగా ఉండేది. అయితే ఈ దఫా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆ ప్రభావం, ఆ సందడి ఎక్కడా కనిపించడం లేదు. దీనికి కారణం ప్రధాన రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార కార్యాలయాలు నెహ్రూచౌక్‌కు దూరంగా ఉండడమే. గత ఎన్నికలు వరకు ప్రధాన రాజకీయ పార్టీలు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయాలు నెహ్రూచౌక్‌లోనే ఉండేవి. దీంతో ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ ప్రాంతం ప్రచారాల హోరుతో మారుమోగేది. వివిధ పనులపై పట్టణానికి వచ్చేటప్పుడు జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ కార్యాలయాల వద్ద నెలకొన్న సందడిని ఆసక్తిగా తిలకించేవారు. వారు తిరిగి గ్రామాలకు వెళ్లి నెహ్రూచౌక్‌లో సందడి గురించి చెప్పుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. వివిధ పార్టీలకు చెందిన ప్రచార రథాలు ఈ జంక్షన్ మీదుగా మైకుల ద్వారా ప్రచారం చేయడం తప్ప నేటి వరకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల సందడి కనిపించడం లేదు. ఈ దఫా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికల బరిలోకి లేకపోవడం కూడా ఒక కారణంగా పలువురు చెబుతున్నారు. కూటమి పొత్తులో భాగంగా అనకాపల్లి నియోజకవర్గం జనసేన పార్టీకి కేటాయించారు. ఎంపీ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. దీనికి తోడు పట్టణానికి కిలోమీటరు దూరంలోని జాతీయ రహదారిలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయం ఉంది. అలాగే జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఎన్నికల కార్యాలయం రింగురోడ్డులోని బెల్లం మార్కెట్‌కు సమీపంలో ఉంది. వైసీపీ ఎన్నికల కార్యాలయం కూడా రింగురోడ్డులోని రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నాయుళ్లవీధిలో ఉంది. ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచార కార్యాలయాలు నెహ్రూచౌక్‌కు దూరంగా ఉండడంతో ఇక్కడ ఎన్నికల సందడి కానరావడం లేదు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వారు ఏర్పాటు చేసుకున్న ఎన్నికల ప్రధాన కార్యాలయాల నుంచి తెల్లవారుజామున ప్రచారానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వాహనాలు వెళ్లిపోతున్నాయి. కనీసం ఒక దగ్గర ఆగి కాసేపు ప్రచారం చేసే పరిస్థితి కూడా ఉండడం లేదు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రచార సభలకు మాత్రమే ఈ నెహ్రూచౌక్ కళగా మారింది. ఏది ఏమైనా ఈ సార్వత్రిక ఎన్నికల వేళ గతంతో పోల్చితే నెహ్రూచౌక్‌లో ఎన్నికల కళ కనిపించడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయండి

▸▸ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు, మే 4 : ఈనెల 6న తాళ్లపాలెంలో జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కోరారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న బహిరంగ సభకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రానున్నారని చెప్పారు. టీడీపీ విశాఖ అభ్యర్థి శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థులు, జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు, తుని, ప్రత్తిపాడు, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొననున్నారని తెలిపారు. ప్రధాని రాక వల్ల మౌలిక వసతులతో పాటు పారిశ్రామిక పురోభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చిన నిధులు స్థానికంగా ఖర్చు చేసిన దాఖలాలు తమకు ఎక్కడా కనిపించలేదన్నారు. గడచిన ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చిన నిధులన్నీ వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. జిల్లాలో పరిశ్రమలు రావాలి, సంక్షేమం కావాలి, అభివృద్ధి జరగాలి ఇదే తన ప్రధాన ఎజెండా అని స్పష్టం చేశారు. ప్రధాని సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నారా రోహిత్ రోడ్డు షోకు ఆదరణ



రోడ్డు షోలో పాల్గొన్న నారా రోహిత్. చిత్రంలో దాడి రత్నాకర్ ఉన్నారు.

అనకాపల్లి టౌన్, మే 4 : ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లిలో సినీనటుడు నారా రోహిత్ నిర్వహించిన రోడ్డు షోకు మంచి ఆదరణ లభించింది. విశాఖ నుంచి ఆయన నేరుగా డైట్ కళాశాలకు శనివారం సాయంత్రం చేరుకున్నారు. ఈ సందర్భంగా రత్నాకర్ సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం జాతీయ రహదారిలోని పూడిమడకరోడ్డు జంక్షన్ నుంచి రోడ్డు షో ప్రారంభమైంది. దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో చైతన్య రథంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, కాండ్రేగుల శ్రీరామ్ ఆశీనులు కాగా రోడ్డు షో మొదలైంది. పూడిమడకరోడ్డులోంచి నెహ్రూచౌక్, మెయిన్‌రోడ్డు, చిననాలుగురోడ్ల జంక్షన్, చింతావారివీధి, వేగివీధి, అగ్గిమర్రిచెట్టు, దిబ్బవీధి, సంతోషిమాత ఆలయం మీదుగా పరమేశ్వరి పార్కు జంక్షన్‌కు రోడ్డు షో చేరింది. దారి పొడవున ప్రజలు రోహిత్‌కు ఆదరణ చూపారు. అనంతరం ఆయన బహిరంగసభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొలిమేర నాయుడు, జనసేన నాయకులు జోగేంద్ర, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రమేష్‌ను ఎంపీగా గెలిపిస్తే అనకాపల్లి అభివృద్ధి

▸▸ సినీ నిర్మాత నట్టి కుమార్



చోడవరం, మే4: సీఎం రమేష్‌ను ఎంపీగా అభ్యర్థిగా గెలిపిస్తే అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని సినీ నిర్మాత నట్టి కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రమేష్‌కు రాజ్యసభ సభ్యునిగా ఉన్న అనుభవం, మోడీ, అమిత్‌షాలతో ఉన్న పరిచయాల వల్ల జిల్లాకు పరిశ్రమలు ఎక్కువగా రావడానికి అవకాశం ఉందన్నారు. తద్వారా ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకా శాలు పెరుగుతాయని, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి డిప్యూటీసీఎం బూడి ఎంపీగా గెలిపిస్తే జిల్లాకు ఒరిగేదేమీ ఉండదన్నారు. డిప్యూటీ సీఎంగా సొంత జిల్లాను పట్టించుకోని ఆయన, ఎంపీగా ఏం చేస్తారని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎంగా అసెంబ్లీలో మాట్లాడలేని బూడి, ఎంపీగా పార్లమెంట్‌లో ఏం మాట్లాడతారన్నారు. అనకాపల్లి బాగుపడాలంటే సీఎం రమేష్ ఎంపీగా గెలవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని ప్రకటించారు.

డిప్యూటీ సీఎంపై ఎన్నికల కమిషన్ స్పందించాలి

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థులు ప్రచారం చేయకుండా, డిప్యూటీ సీఎం బూడి అడ్డుకుని దాడులు చేయడం సరికాదని, ఎన్నికల కమిషన్ స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని నట్టి కుమార్ డిమాండ్ చేశారు. సొంత కుటుంబీకులపై దాడి చేసే హక్కు ఆయనకు ఎవరిచ్చారని నట్టికుమార్ ప్రశ్నించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో శ్రీప్రకాష్ విద్యార్థి



శ్రీప్రకాష్ విద్యార్థి రియాన్ష్

పాయకరావుపేట, మే 4 : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థి బి.రియాన్ష్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సాధించాడు. శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో యూకేజీ చదువుతున్న బి.యాన్ష్ ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఎంపిక ప్రక్రియలో కేవలం తొమ్మిది సెకండ్లలో దక్షిణ అమెరికా ఖండంలో 13 దేశాల జెండాలను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సాధించాడు. అదే విధంగా ఈ విద్యార్థి ప్రపంచ పటంలో దేశాలను గుర్తిండంతో పాటు వాటి రాజధానులు, భారతదేశంలోని రాష్ట్రాల రాజధానులను గుర్తించడంలో కూడా ప్రతిభ కనబరుస్తున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

ఉద్యోగులు ఓటు ఇలా వేయాలి

మీకు తెలుసా!


పోస్టల్ బ్యాలెట్ వినియోగించే ఉద్యోగులు ఓటుకు రెండు గీతల మధ్య టిక్ పెట్టాలి. లేకపోతే దాన్ని పరిగణనలోకి తీసుకోరు. గత ఎన్నికల్లో అధిక శాతం పోస్టల్ బ్యాలెట్లు ఈవిధంగానే లెక్కింపునకు నోచుకోలేదు. పై అభ్యర్థి పేరుకు గాని కింద ఉన్న అభ్యర్థి పేరుకు గాని తగలకుండా టిక్ చేయాలి. రెండు గీతల మధ్య రైట్ మార్క్ చేస్తేనే దాన్ని లెక్కింపునకు తీసుకుంటారు. ● ఆరిలోవ

ఒక్క చాన్స్‌కే... చుక్కలు చూపించారు

జగన్ ఐదేళ్ల పాలనపై అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి

- కుడి చేత్తో పది ఇచ్చి... ఎడమచేత్తో వంద లాక్కొన్నారనే భావనే
- ఇసుక సమస్యతో పనులు దొరకడం లేదంటున్న భవన నిర్మాణ కార్మికులు
- ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు, చేతివృత్తిదారులు, కాంట్రాక్టర్లు...అన్ని వర్గాల్లోనూ ఆగ్రహం

రోజువారీ కూలీ నుంచి ప్రభుత్వ ఉద్యోగి వరకూ... అందరిలోనూ అదే భావన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'ఒకే ఒక్క చాన్స్' అంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఎన్నికల్లో చేసిన ప్రచారానికి అండగా నిలబడి అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలకు... ఐదేళ్లలో ఆయన చుక్కలు చూపించారు. ఆలోచనా రహిత నిర్ణయాలతో రోజువారీ కూలీల మొదలు ప్రభుత్వ ఉద్యోగుల వరకూ అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేశారు. గడిచిన ఐదేళ్లలో జీవన స్థితిగతుల్లో మార్పులు రాకపోగా, ఇంకా దుర్భరంగా మారాయని పలువురు వాపోతున్నారు.

పాలనపై తీవ్ర అసంతృప్తి

వైసీపీ పాలనపై ఏ వర్గాన్ని కదిపినా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో ఉద్యోగులు ఒక భాగం. అటువంటి ఉద్యోగులే ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల్లోనూ తీవ్ర అన్యాయం చేశారంటున్నారు. గడిచిన ఎన్నికల్లో సీఎం జగన్ అధికారంలోకి రావాలని బలంగా కోరుకున్న ప్రభుత్వ ఉద్యోగులంతా ఇప్పుడు వ్యతిరేకంగా ఉన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. అలాగే అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తామంటూ ఇచ్చిన హామీని జగన్ పూర్తిగా విస్మరించారని గుర్తుచేస్తున్నారు. వేలాది మంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించ కుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోం దన్న భావనను వ్యక్తం చేస్తున్నారు.

ఇక, ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కీలకంగా వ్యవహరించిన మరో వర్గం భవన నిర్మాణ కార్మికులు. దాదాపు గడిచిన ఎన్నికల్లో వీరంతా వైసీపీ అధినేత జగన్ అధికారంలోకి రావాలని బలంగా కోరుకున్నారు. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత నూతన ఇసుక విధానం కారణంగా ధర పెరగడంతో పాటు కొరత రావడంతో నిర్మాణ రంగం కుదేలైపోయింది. గడిచిన ఐదేళ్లలో నిర్మాణ రంగంలో పనులు నత్తనడకన సాగుతుండడంతో భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆటో డ్రైవర్లు కూడా గడిచిన ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రావడానికి తీవ్రంగా కృషిచేశారు. ఏడాదికి పది వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నా..అంతకు రెండు, మూడు రెట్లు అధికంగా పెనాల్టీలు, చలానాలు పేరుతో ఈ ప్రభుత్వం దోచుకుంటోందని ఆటో డ్రైవర్ రాజేశ్వరరావు వాపోయారు. 15 ఏళ్లుగా ఆటో నడుపుతున్నానని, తానెప్పుడూ ఐదేళ్లలో కట్టినంతగా చలానాలు చెల్లించలేదని పేర్కొన్నారు.

నిరుద్యోగులకు జెల్ల

వైసీపీ ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయిన మరో వర్గం నిరుద్యోగులు. గడిచిన ఐదేళ్లలో తమకు వైసీపీ సర్కారు తీరని అన్యాయం చేసిందని నిరుద్యోగులు పేర్కొంటున్నారు. ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, ప్రభుత్వ శాఖల్లో వేలాదిగా ఉన్న ఖాళీలు భర్తీ చేస్తానంటూ...నమ్మించి సీఎం జగన్ నట్టేట ముంచాడని నిరుద్యోగులు వాపోతున్నారు. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని, ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ఇచ్చిన పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియను పూర్తి కూడా చేయలేకపోయారని జ్ఞానేంద్ర అనే నిరుద్యోగి వాపోయాడు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కనీసం రెండు లక్షల మంది నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం ఆశగా ఎదురు చూశారని, వారి ఆశలపై జగన్ నీళ్ల చల్లారని పలువురు స్నేహలత అనే డీఎస్సీ అభ్యర్థి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

చేతి వృత్తులకు ఏదీ సాయం..?

గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేందుకు అనుగుణంగా యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చేవారు. ఈ రుణాలతో డెయిరీ ఫామ్, కోళ్ల ఫారాలు, చిరు దుకాణాలు, ఆయిల్ మిల్స్, ఇతర పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని వారు ఉపాధి పొందడంతోపాటు...నలుగురికి ఉపాధి కల్పించేవారు. కానీ, గడిచిన ఐదేళ్లలో చేతి వృత్తులకు, ఆయా వర్గాలకు సాయాన్ని అందించకపోవడంతో వారంతా ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లేకుండా పోయింది. చేతి వృత్తులను ఆదుకునేందుకు ఈ ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టలేదని రజకుడు అప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. తానూ ఈ వృత్తిని వదల్లేక చేస్తున్నానని పేర్కొన్నాడు.

ఆర్థిక భారం మోపిన జగన్..

గడిచిన ఐదేళ్లుగా సీఎం జగన్ బటన్ నొక్కుడుతోనే ప్రభుత్వాన్ని నడిపారు. కుడి చేత్తో పది ఇచ్చి..ఎడమ చేత్తో వంద లాగేసినట్టుగా పాలన సాగిందన్న భావనను ఆయా వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. నిత్యావసర సరకులు, విద్యుత్ చార్జీలు ఆర్థికంగా భారంగా మారాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో పోలిస్తే సాధారణ, మధ్య తరగతి కి చెందిన ఒక్కో కుటుంబంపై నెలకు కనీసం రూ.3,000 నుంచి రూ.8,000 వరకు భారం అదనంగా పెరిగిందని పేర్కొంటున్నారు. విద్యుత్ చార్జీలు సంగతి సరే సరి. గతంలో రూ.250 విద్యుత్ బిల్లు వస్తే..జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రెండు, మూడు రెట్లు బిల్లులు పెరిగిపోయాయని రామారావు అనే ప్రైవేటు ఉద్యోగి వెల్లడించాడు.

కాంట్రాక్టర్లదీ ఇదే బాధ..

ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లోని కాంట్రాక్టర్లు, వ్యాపారులు కూడా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా చితికిపో యారు. కోట్లాది రూపాయల బిల్లులను ఈ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఒక్క విశాఖ జిల్లాకు సంబంధించి సుమారు మూడు వేల కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు చెబు తున్నారు. ఆయా పనులు చేసిన వందలాది మంది కాంట్రాక్టర్లు ఆర్థికంగా చితికిపోయారు. బిల్లులు క్లియర్ చేయించుకోవడానికి ప్రభుత్వ పెద్దలు, అధికారులు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని వారంతా వాపోతున్నారు.

ఇంటిని గుల్ల చేస్తున్న మద్యం

వైసీపీ సర్కార్ వల్ల పొందిన లబ్ధి పొందిన కుటుంబాలు కంటే..జగన్ తీసుకువచ్చిన నాసిరకం మద్యంతో నాశనమైన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం రేట్లను జగన్ ప్రభుత్వం భారీగా పెంచేసింది. ఈ పెరిగిన ధరలతో ఆర్థికంగా ఆయా కుటుంబాలు నష్టపోవడమే కాకుండా..నాసిరకం మద్యంతో ఎంతో మంది తీవ్ర అనా రోగ్యాలకు గురయ్యారు. డబ్బుతోపాటు ఆరోగ్యమూ పోయిందని, నాసిరకం మద్యం ఎంత తాగినా మత్తు వచ్చేది కాదని, తాగుతున్న కొద్దీ తాగాలని పిస్తూ ఉంటుందని రాజు అనే కూలీ పేర్కొన్నాడు. నాసిరకం మందును తెచ్చి.. మందుబాబులు జీవితాలను నాశనం చేశాడని పేర్కొన్నాడు.

ఆదాయం కంటే ఖర్చులు అధికమయ్యాయి



హమాలీల పరిస్థితి దారుణంగా మారింది. ఏళ్ల తరబడి ఇదే వృత్తిని నమ్ముకుని ఉన్నా...కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం కూడా రావడం లేదు. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు కష్టపడితే రూ.600 కూలీ రావడం కూడా కష్టమవుతోంది. మరోపక్క, ఇంటి అద్దె, కరెంట్ చార్జీలు, పెట్రోల్ ధరలు అన్నీ పెరిగిపోయాయి. స్కూల్ ఫీజులు, నిత్యావసర సరకుల ధరలతో అల్లాడుతున్నాం. చాలీ,చాలని రోజువారీ ఆదాయంతో ఇంటి నడపడం కష్టమవుతోంది. గడిచిన మూడేళ్ల నుంచి చేసేందుకు పని కూడా పెద్దగా దొరకడం లేదు. ఏళ్ల నుంచి నమ్ముకుని వృత్తిని వదులుకోలేకపోతున్నాం. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా భరిస్తున్నాం. ప్రభుత్వం మా లాంటి వారిని ఆదుకోవాలి. సరైన కూలీ లభించేలా చర్యలు తీసుకోవాలి.

- పారిసిరెడ్డి అప్పలరాజు, హమాలీ మేస్త్రీ

ఇచ్చింది ఈతకాయ-తీసుకున్నది తాటికాయ



వైసీపీ పాలనలో వాహనమిత్ర ద్వారా నాలుగేళ్లు రూ.10 వేలు చొప్పున ఇచ్చింది. ఐదో ఏడాది ఇవ్వలేదు. కానీ చాటుగా ఫొటోలు తీసి జరిమానాల రూపంలో రూ.135, 335, 1035, 1135 చొప్పున ప్రతి ఆటోడ్రైవర్ వద్ద వసూలు చేయించింది. ఇక రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో పలు మార్లు ఆటోలు మరమ్మతులకు గురయ్యేవి. ఆ ఖర్చులు అదనం. అదేవిధంగా మొదటి ఏడాది 'వాహనమిత్ర' డబ్బు అందుకున్న అనేకమంది పేర్లు రెండో ఏడాది జాబితాల్లో లేవు. ఏవో సాకులు చూపించి సుమారు 25 శాతం మందిని పక్కనపెట్టేశారు. ఆటో డ్రైవర్లకు పలు రాయితీలను ఇస్తామన్న ప్రకటనలు కార్యారూపం దాల్చలేదు. ఆటోడ్రైవర్ల సమస్యలపై పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా చర్యలు శూన్యం. మొత్తమ్మీద చూస్తే వైసీపీ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఈతకాయ ఇచ్చి తాటికాయ తీసుకున్నట్టుగా వ్యవహరించింది.

- కె.సూరిబాబు, ఆటో డ్రైవర్, గాజువాక

పనులు దొరకడం లేదు



గడిచిన 20 ఏళ్ల నుంచి వుడ్ వర్కర్‌గా పనిచేస్తున్నా. పనికి వెళితే రోజుకు వేయి రూపాయలు వస్తుంది. గతంలో నెలలో కనీసం 25 రోజులు పని దొరికేది. గడిచిన కొన్నాళ్ల నుంచి పనిచేద్దామన్నా దొరకడం లేదు. పనులు పూర్తిగా తగ్గిపోయాయి. ఇసుక, సిమెంట్, ఇతర ధరలు పెరిగిపోవడంతో నిర్మాణ రంగంలో పనులు నిలిచిపోయాయి. దీంతో మాకూ పని దొరకడం లేదు. రెండు, మూడు రోజులు కూడా పని దొరకడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. పెరిగిన చార్జీలు, నిత్యావసర సరకుల ధరలతో కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టమవుతోంది. ప్రతినెలా అప్పులు చేస్తున్నా. గతంలో నెలకు రూ.25 వేలు ఆదాయం వస్తే..ఖర్చులన్నీ పోను ఐదారు వేలు మిగిలేవి. ఇప్పుడు ఆదాయం లేకపోగా, ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రూపాయి ఆదాయం లేదు. పెరిగిన ధరలతో గతంతో పోలిస్తే నెలకు అదనంగా నాలుగు వేలు ఖర్చు అవుతోంది. ఇంటి అద్దె, ఇతర ఖర్చులతో కలిపి నెలకు రూ.17 వేలు అవసరం అవుతోంది.

- సీహెచ్ శ్రీనివాసరావు, వుడ్ వర్కర్

చుక్కలు కనిపిస్తున్నాయి.. ఘోరంగా పరిస్థితి



గడిచిన ఐదేళ్లుగా ఆర్థికంగా చితికిపోయాం. పెరిగిన రేట్లుతో నెలకు రూ.4 వేలు వరకు అదనపు భారం పెరిగింది. పెయింటింగ్ పనికి వెళితే రూ.700 వరకు వస్తుంది. పాత ఇళ్లకు ఏమైనా పెయింటింగ్ వర్క్సు ఉంటే వేస్తున్నాం. కొత్త భవనాల పనులు ఏడాదిలో 20కు మించి దొరకడం లేదు. గతంలో పదుల సంఖ్యలో కొత్త భవనాల పెయింటింగ్ వర్క్ చేయడానికి పనులు లభించేవి. పెరిగిన రేట్లతో పనికి వెళ్లినప్పుడు బయట భోజనం కూడా చేయలేని పరిస్థితి. గతంలో అన్నా క్యాంటీన్ ఉంటే అక్కడే తినేసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదు. ప్రతిరోజూ పని కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి. చేతిలో నైపుణ్యం ఉండి కూడా పని దొరకడం లేకపోవడం దారుణం. జగన్ వచ్చి ఏదో చేస్తాడనుకుంటే.. మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పనుల్లేకుండా చేశాడు. ఎవరికి చెప్పుకోవాలో కూడా మా బాధ తెలియడం లేదు.

- టి.ఉదయ్, పెయింటింగ్ వర్కర్

స్వర్ణకారులకు అన్యాయం



ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం స్వర్ణకారులకు, విశ్వబ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం చేసింది. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేకపోడంతో ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్వర్ణకారులను అన్ని విధాలుగా ఆదుకున్నారు. ఆదరణ పథకంలో భాగంగా గోల్డ్ వైర్లు (తీగలు) చేసే మెషిన్లు, ఉంగరాలు సైజ్ చేసే మెషిన్లు, రేకులు తీసే మెషిన్లు అందించారు. సబ్సిడీతో కూడిన రుణాలను అందించి ఆర్థికంగా చేయూతనిచ్చారు. జిల్లావ్యాప్తంగా 40 వేల మంది స్వర్ణకారులు చేసేందుకు పనులు లేక వృత్తికి దూరమయ్యారు. ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకునేందుకు కనీస చర్యలను చేపట్టలేదు. స్వర్ణకారులకు ఇచ్చిన అనేక హామీలను జగన్ ప్రభుత్వం విస్మరించింది.

- పక్కి కొండబాబు, రాష్ట్ర స్వర్ణకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్

బరిలో ఆరుగురే...

- చోడవరం అసెంబ్లీ సెగ్మెంట్ రికార్డు
- రాష్ట్రంలో అతి తక్కువ అభ్యర్థులు పోటీలో ఉన్న నియోజకవర్గంగా గుర్తింపు

రాష్ట్రం మొత్తం మీద అతి తక్కువగా ఆరుగురు అభ్యర్థులు మాత్రమే బరిలో ఉన్న నియోజకవర్గంగా చోడవరం రికార్డు సృష్టించింది. ఈ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, వైసీపీ అభ్యర్థిగా కరణం ధర్మశ్రీ, కాంగ్రెస్ అభ్యర్థిగా జగతా శ్రీనివాసరావు, బీఎస్పీ అభ్యర్థిగా వేగి మహాలక్ష్మినాయుడు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అభ్యర్థిగా సవరాల గణేష్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పేరిచర్ల వివేకరాజులు బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, ప్రధాన టీడీపీ, వైసీపీలకు డమ్మీలుగా వేసిన ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లను అధికారులు స్క్రూటినీలో తిరస్కరించడంతో, కేవలం ఆరుగురు మాత్రమే రంగంలో మిగిలారు. చోడవరం నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో తొమ్మిది మంది పోటీలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య ఆరుకు తగ్గిపోయింది. గత ఎన్నికల్లో ముగ్గురు ఇండిపెండెంట్లు పోటీలో ఉండగా, ఈసారి కేవలం ఒక్కరే బరిలో ఉన్నారు. ● చోడవరం

మద్రాస్ ప్రెసిడెన్సీలో ఎమ్మెల్యేగా కొయ్యూరు ప్రాంత వాసి

- 1937లో భద్రాచలం నియోజకవర్గం నుంచి పెద్దిపడాల్ ఎన్నిక



పనసల పెద్దిపడాల్

మన్యం పితూరీలో పాల్గొన్నందుకు మండలంలో పెదమాకవరానికి చెందిన పనసల పెద్దిపడాల్ రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష అనుభవించారు. అనంతరం 1937లో మద్రాస్ ప్రెసిడెన్సీ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా భద్రాచలం నుంచి పెద్దిపడాల్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పెద్దిపడాల్ అప్పటి గూడెం ముఠాకు చెందిన మాకవరం (ప్రస్తుతం కొయ్యూరు మండలంలో చేరిన పెద మాకవరం) భూస్వామి. ఆయనకు 1922-24 మధ్య జరిగిన అల్లూరి మన్యం పితూరీలో పాల్గొన్నందుకు రెండు సంవత్సరాలు కారాగార శిక్ష పడింది. ఆయన ఉన్నత న్యాయస్థానానికి అప్పీల్‌కు వెళ్లడంతో శిక్ష రద్దయ్యింది. అనంతరం పెద్దిపడాల్ శరభన్నపాలేనికి మకాం మార్చారు. బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం మొత్తం 11 ప్రావిన్సులకు 1937లో ఎన్నికలు నిర్వహించగా జస్టిస్, కాంగ్రెస్‌లు పోటీ చేశాయి. మద్రాస్ ప్రెసిడెన్సీలో గల భద్రాచలం నియోజకవర్గం భద్రాచలం నుంచి సాలూరు వరకూ ఉండేది. ఈ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పనసల పెద్దిపడాల్ (గిరిజన భగత తెగ) పోటీ చేసి గెలుపొందారు. అప్పటి మద్రాస్ ప్రావిన్స్‌కు ముఖ్యమంత్రిగా చక్రవర్తి రాజగోపాలాచారి అయ్యారు. రెండో ప్రపంచ యుద్ధంలో భారత దేశ ప్రమేయానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ సభ్యులంతా రాజీనామా చేశారు. అయితే రాజీనామాకు కొద్ది నెలల ముందే పెద్దిపడాల్ పదవిలో ఉండగానే చనిపోయారు. పెద్దిపడాల్ తమ్ముడు కొడుకు పనసల బోడయ్యపడాల్ శరభన్నపాలెం సర్పంచ్‌గా, కొయ్యూరు సమితి ఉపాధ్యక్షులుగా పని చేశారు. 1967లో చింతపల్లి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. పనసల పెద్దిపడాల్ చెల్లెలి మనమడు మెట్టడం వీరవెంకటసత్యనారాయణ (ఎంవీవీ సత్యనారాయణ) రెండు పర్యాయాలు చింతపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశారు. ● కొయ్యూరు

పార్టీ ఇచ్చిన జెండాలు.. రెండు వాహనాలు!

నాటి ఎన్నికల్లో అవే ప్రచార సాధనాలు



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

మా రోజుల్లో డబ్బుతో రాజకీయాలు చేయలేదు


ప్రజాసేవకే అంకితమయ్యే నేతలుండేవారు

భీమిలి మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పల నరసింహరాజు

పార్టీ అందించిన జెండాలు, సమకూర్చిన రెండు వాహనాలు... ఇవే ఎన్నికల్లో ప్రచారానికి ప్రధాన ఆధారం. డబ్బు లేదు... భారీ ర్యాలీలు... హంగూ ఆర్భాటాలు లేవు... సాదా సీదాగా గ్రామలన్నీ తిరిగి.... ఓటు అడగడమే తెలుసు... గెలిస్తే ఏం చేస్తామో... సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపిస్తామో వివరించి చెప్పడమే మాకు తెలిసిన రాజకీయం. డబ్బు, ఇతర స్వార్థపూరిత ఆలోచనలే లేవు. కేవలం ప్రజా సేవకే అంకితమయ్యేలా అప్పటి నేతలు ఉండేవారని చెబుతున్నారు భీమిలి మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పల నరసింహరాజు. అప్పటి, ఇప్పటి ఎన్నికలపై తన మనసులోని భావాలను పంచుకున్నారు.

స్వాతంత్ర్యం కోసం నిస్వార్థంగా పనిచేసిన గాంధీ, నెహ్రూ వంటి నాయకులు మన దేశాన్ని మనమే పరిపాలించుకోవాలన్న స్ఫూర్తితో పనిచేశారు. స్వాతంత్ర్యానంతర కాలంలో ఎంతోమంది రాజకీయాల్లోకి వచ్చి ప్రజాహితం కోసం పనిచేశారు. ఆ కోవలో విజయనగరం సంస్థానాధీశుడు డాక్టర్ పీవీజీ రాజు ప్రముఖంగా నిలుస్తారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ప్రజా శ్రేయస్సు, ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేశారు. భీమిలి ఎమ్మెల్యేగా పనిచేసిన పీవీజీ రాజు నుంచి ఆనందగజపతిరాజు వరకు నాటి ప్రజాప్రతినిధులకు ఎలాంటి వ్యాపారాలు లేవు. వారి తరువాత నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన నాకు కూడా వ్యాపారాలు లేవన్నారు. ప్రజలకు సేవ చేయడానికే వచ్చామన్న భావన ఉండేది. గ్రామాల్లో పర్యటించినప్పుడు ఎవరైనా తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వస్తే దానికి అవసరమైన తెల్ల కాగితాలు కూడా వెంట తీసుకువెళ్లే పరిస్థితి ఉండేది. ప్రజలు నేరుగా ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను వివరించేవారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి అనతికాలంలోనే అధికారం చేపట్టిన నందమూరి తారక రామారావు దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశారు. కిలో రెండు రూపాయలకే బియ్యం, జనతా వస్త్రాలు, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, బోరుబావుల ఏర్పాటు, విద్యుత్ సదుపాయం, గురుకుల పాఠశాలల స్థాపన వంటి సౌకర్యాలు కల్పించారు. ఆయన హయాంలో భీమిలి ఎమ్మెల్యేగా పనిచేయడం గర్వకారణం. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే డైట్ కళాశాల, మహిళా పాలిటెక్నిక్, బాలికల గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశాం. ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వద్దకు వెళ్లి సమస్యలు విన్నవిస్తే వెంటనే నిధులు మంజూరు చేసేవారు. గతంలో ప్రతిపక్షాలు, నాయకులపై వ్యక్తిగత విమర్శలు, దూషణలు ఉండేవి కాదు. ప్రస్తుతం ఎన్నికల్లో వ్యాపారులు, ఇతర రకాల వారు పోటీ చేస్తున్నారు. ప్రచార వ్యయం భారీగా పెరిగింది. ఆరోపణల స్థాయి పెరిగిపోయి, అభివృద్ధి కనిపించకుండా పోయింది. డబ్బుతో కూడిన రాజకీయాల కారణంగా స్థోమత ఉన్నవారే అభ్యర్థువుతున్నారు. ● పద్మనాభం

జంపింగ్...జపాంగ్స్!



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఈ ఎన్నికలు చాలా విచిత్రంగా ఉన్నాయి. మొన్నటి వరకు ఏ నాయకుడు ఏ పార్టీలో ఉన్నాడో స్పష్టంగా అందరికీ తెలుసు. ఫలానా అంటే..ఏ పార్టీయో చెప్పగలిగే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలా లేదు. చాలా మంది పార్టీలు మారిపోతున్నారు. ఎప్పుడు..ఎవరు..ఎందుకు మారుతున్నారో తెలియడం లేదు. మెడలో కండువా చూసి, పక్కనున్న పెద్ద నాయకుడిని చూసి..'ఓహో..! సారు.. పార్టీ మారిపోయారన్న మాట' అని అనుకోవలసి వస్తోంది. ఎమ్మెల్యే టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నం చేసి ఇక రాదని నిర్ధారించుకున్నాక పలువురు ఇతర పార్టీల్లోకి మారిపోతున్నారు. మరికొందరు ఒక పార్టీ తరఫున గెలిచి, వేరే పార్టీతో నాలుగున్నరేళ్లు అంట కాగి...ఇప్పుడు మళ్లీ గెలిచిన పార్టీలోకే వస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వారిని కూడా మళ్లీ చేర్చుకుంటున్నారు. అనేక మంది కార్పొరేటర్లది ఇదే పరిస్థితి. రాజకీయ అవసరాలు మరి అని అనుకోవలసి వస్తోంది.

ఓటరు మాట

పని చేయాలన్న తపన ఉండాలి



ప్రజలకోసం పనిచేయాలన్న తపన ఉన్న నాయకులకు అవకాశం ఇవ్వాలి. సరికొత్తగా ఆలోచించే నేతలను ఎన్నుకుందాం. నాయకుడి ఆలోచనలు, గుణగణాలు, నేర చరిత్ర, వంటి అంశాలన్నీ గుర్తించాలి. పోటీ చేసే అభ్యర్థుల్లో ఎవరు మంచివారు, ప్రజలకు దగ్గరగా ఉంటారు, సత్వరమే సమస్యలు పరిష్కరించగలుగుతారో గుర్తించి ఓటువేయాలి.

- గండ్రేటి సాయికుమార్, గోపాలపట్నం

బూతులు మాట్లాడేవారిని దూరం పెట్టాలి



చట్టసభల్లో వ్యక్తిగత దూషణలకు పాల్పడే వారిని, ఎదుట వారిని కించి పరిచే వ్యాఖ్యలు చేసేవారిని, బూతులు మాట్లాడేవారిని దూరం పెట్టాలి. సమస్యలపై గళమెత్తని వారిని ఎన్నుకుంటే బతుకులు బుగ్గిపాలవుతాయి. ఇలాంటి వారిని తమ తిరస్కరించి, ప్రజాసమస్యలపై గళం విప్పగలిగే సామర్థ్యం ఉన్నవారికి ఓటు వేద్దాం.

- శ్రీనివాసరాజు, భీమిలి

సంపద సృష్టించే నాయకుడు కావాలి



రాష్ట్రంలో సంపద సృష్టించి అభివృద్ధి చేయగలిగిన నాయకుడు కావాలి. వనరులను ఉపయోగించుకొని, మానవ వనరులను వినియోగించుకోవాలనే తపన ఉన్న నేతకు అధికారమిస్తేనే భవిష్యత్తు. సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచించే వారికిని అధికారంలోనికి తేవాలి. ఓటర్లు బాగా ఆలోచించి ఓటు వేయాలి.

- ఈఎస్ మాధవన్, రామ్‌నగర్

ఆర్థిక నేరగాళ్లకు అవకాశం ఇవ్వొద్దు



ఆర్థిక నేరగాళ్లు, దుర్మార్గులు, అవినీతి పరులు పాలకులైతే రాష్ట్ర భవిష్యత్తు నాశనమవుతుంది. రాజ్యాంగ బద్ధంగా దుచుకునే నేతలే అవసరం. అనుభవం ఉన్న వారితో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది. ఆస్తులు పోగుచేయడం, అడ్డదారిలో దోపిడీ చేసేవారిని ఓటుద్వారా తిరస్కరించాలి.

- కొత్తపల్లి బంగార్రాజు, గాజువాక

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

పాల్మన్‌పేటలో సీఎం రమేశ్ సతీమణి ప్రచారం



పచారం నిర్వహిస్తున్న సీఎం రమేశ్ సతీమణి సీఎం శ్రీదేవి

పాయకరావుపేట రూరల్, మే4: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితలను గెలిపించాలని కోరుతూ శనివారం మండలంలోని పాల్మన్‌పేటలో సీఎం రమేశ్ సతీమణి సీఎం శ్రీదేవి, టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత కుమారుడు అఖిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈదటం సమీపంలో చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను, సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, రవిరాజు, చింతకాయల రాంబాబు బొంది కాశీవిశ్వనాథ్, పీర్ల కల్యాణి, ఎం.అశోకచక్రవర్తి, దేవవరపు రఘు, నానాజీ, మానవెల్లి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో దార్లపూడి మాజీ సర్పంచ్ చేరిక



సీఎం రాజేష్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న కోన రామారావు

ఎస్. రాయవరం, మే 4: మండలంలోని దార్లపూడి మాజీ సర్పంచ్, వైసీపీ నేత కోన రామారావు, అనుచరులు శనివారం వైసీపీని వీడి బీజేపీలో చేరినట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాకలపాటి రవిరాజు తెలిపారు. అనకాపల్లిలో ఉన్న ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో సీఎం రాజేష్ సమక్షంలో మాజీ సర్పంచ్ రామారావు, గుడివాడ పంచాయతీకి చెందిన సీతా రామరాజు, రామరాజు, పెరిచర్ల పద్మరాజు, ఎస్. రాయవరానికి చెందిన వీర్ల రామకృష్ణ బీజేపీలో చేరారు. వారందరినీ సీఎం రాజేష్ కండువాలు వేసి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జోగినాయుడు పాల్గొన్నారు.

వెంకటనగరంలో పలువురు టీడీపీలో చేరిక

పాయకరావుపేట రూరల్, మే4 : మండలంలోని వెంకటనగరం సర్పంచ్ వంకా రమణ, వంకా శివ ఆధ్వర్యంలో పంచాయతీ వార్డు మెంబరు పారా గోవిందమ్మ, పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో శనివారం చేరారు. పారా రమణ, పిరాది గోపి, కోడ లక్ష్మయ్య, కోడ పెంటయ్య, వంకా చిట్టిబాబు, పారా జగన్నాథం, పారా కొండయ్య, వంకా అప్పలరాజు, వంకా రాజు, తదితరులకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిత కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పారా గాలి బాబు, వంకా హరి, బి. గోపి, గరికిన అప్పారావు పాల్గొన్నారు.

అంతుల్‌కుమార్ అంజన్ ఆశయ సాధనకు పోరాడాలి

తుమ్మపాల, మే 4 : దివంగత సీపీఐ జాతీయ నేత అంతుల్‌కుమార్ అంజన్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అంతుల్‌కుమార్ అంజన్ మృతి చెందడం కార్మిక, కర్షక లోకానికి తీరని లోటన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్తిబాబు, పోతురాజు, సత్యనారాయణ, రమణ, నూకరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

పాయకరావుపేట, మే 4 : రాష్ట్ర అభ్యవృద్ధి సాధించాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన నాయకుడు తోట నగేశ్ విజ్ఞప్తి చేశారు. శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పట్టణంలోని 6వ వార్డు, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి ఎన్నికల మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితలకు ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్రెల రాజబాబు, యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, బీజేపీ నాయకులు వేముల వెంకటేశ్వరరావు, గీసాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రమణ కుటుంబానికి ఆర్థిక సాయం

కశింకోట, మే 4 : మండలంలోని అడ్డాం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఈజీఎస్ కూలీ జామి రమణ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ రూ.3050 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు ఆ పార్టీ మండల నాయకుడు కాయల మురళీ ఆ నగదును రమణ కుటుంబ సభ్యులకు నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా కాయల మురళీ మాట్లాడుతూ.. గత కొంతకాలంగా రమణ పక్షవాతంతో మంచాన పడి ఉన్నాడని, ఈ విషయాన్ని దాడి రత్నాకర్‌కు తెలియజేయగా వెంటనే ఆయన స్పందించి సొంతన నగదును పంపించారని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రెడ్డి కన్నబాబు, ఇందుకూరి వర్మ, జోగిరాజు, బండినాయుడు, రెడ్డి మహేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

జగనాసుర పాలనను అంతమొందించండి

... మొదటి పేజీ తరువాయి

బాలకృష్ణ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రజా ధనాన్ని దోచుకున్నారన్నారు. ఈ రావణ జగనాసురుడిని ఈ ఎన్నికల్లో ఓటు అయుధంతో అంతమొందించకుంటే తెలుగుజాతి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పొదుపుతో డ్వాక్రా మహిళలు ప్రపంచ ఖ్యాతి పొందేలా చంద్రబాబు తీర్చిదిద్దితే..నేడు జగన్‌రెడ్డి తెలుగు గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరిపై రూ.5 లక్షల అప్పు చేశాడన్నారు. అభివృద్ధిని విస్మరించి, ప్రతిపక్షాలపై అక్రమ కేసుల బనాయింపుతోనే ఐదేళ్లు గడిపేశారన్నారు. రైతులను, యువతను, నిరుద్యోగులను మోసం చేశారని బాలకృష్ణ ఆరోపించారు. చివరకు తల్లి, చెల్లికి కూడా అన్యాయం చేశారన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీల కోసం అమలు చేసిన 25 పథకాలను రద్దు చేశారన్నారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలను మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. ఏ గ్రామంలోనైనా ఒక సీసీ రోడ్డు అయినా నిర్మించారా?...అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్యకు నోచుకోకుండా చేశారన్నారు. అవన్నీ మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే సాకారం అవుతాయన్నారు. జగన్ పాలనలో ఇబ్బందులు, అక్రమ కేసులకు గురైన వారికి త్వరలో మంచి రోజులు రానున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా సీఎం రమేశ్‌ను, చోడవరం ఎమ్మెల్యేగా కేఎస్ఎన్ఎస్ రాజును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, టీడీపీ నేత గూనూరు మల్లునాయుడు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, గల్లా రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ పింఛన్‌దారులకు తీరని కష్టాలు

- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు
- అయినా అందని పెన్షన్ మొత్తం
- మండుటెండలో అగచాట్లు



కోటవురట్ల: లింగాపురం మినీ స్టేట్‌బ్యాంకు వద్ద వృద్ధుల పడిగాపులు

కోటవురట్ల, మే 4: పండుటాకులకు పింఛన్ కష్టాలు ఇంకా తీరడం లేదు. మండుటెండుల్లో రోడ్ల మీద బ్యాంకుల చుట్టూ పింఛన్‌దారులు తిరుగుతున్నారు. పింఛన్ల ప్రభుత్వం ఈనెల రెండో తేదీన బ్యాంకు అకౌంట్లలో వేసింది. ఆ మొత్తాన్ని తీసుకునేందుకు పింఛన్‌దారులు ఎన్నో పాట్లు పడుతున్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిణీ చేసే అవకాశం ఉన్నా.. ఆ విధంగా చేయకుండా గత నెల అందరికీ సచివాలయాలకు రమ్మని ప్రభుత్వం అక్కడ పంపిణీ చేసింది. దీంతో వృద్ధులు దివ్యాంగులు, మహిళలు పింఛన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనెలలో బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులను అగచాట్లకు గురిచేసింది. ఇప్పుడు మండుటెండలో చెమటలు కారుస్తూ లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మండలంలో 9,685 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో 7,516 మందికి బ్యాంకుల ద్వారాను, 2,169 మందికి ఇంటింటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. కొందరు లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు మనుగడలో లేకపోవడంతో తమ పింఛన్ ఏమైందోనని పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు.

సబ్బవరంలో.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వృద్ధులకు పింఛన్ పాట్లు తప్పలేదు. గత నెల సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం కుట్రలో భాగంగా ఈనెల బ్యాంక్ ఖాతాలకు జమ చేయడంతో బ్యాంకుల నుంచి పింఛన్లు తీసుకునేందుకు మండుటెండల్లో వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో 8,281 సామాజిక పింఛన్లు ఉండగా.. 5,813 మందికి బ్యాంకు ఖాతాల ద్వారా పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు జరిగాయి. 2,468 మందికి ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రామ్మోహన్‌రావు తెలిపారు. బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేని 60 మందికి కూడా ఇంటి వద్ద ఇచ్చే ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో తెలిపారు.

పాయకరావుపేట రూరల్‌లో.. పింఛను సొమ్ము కోసం వృద్ధులు శనివారం కూడా మండుటెండలో బాంకులకు, బాంకు సేవా కేంద్రాల వద్ద అవస్థలు పడ్డారు. మండలంలోని పెదరాంభద్రపురం, గోపాలపట్నం, మంగవరం, సత్యవరం, మాసాహెబ్‌పేట తదితర గ్రామాలకు సత్యవరం గ్రామీణ బ్యాంకులో లావాదేవీలు జరుపుతారు. అయితే పింఛను లబ్ధిదారుల ఖాతాలో చాలా వరకు మనుగడలో లేకపోవడంతో వృద్ధులు బాంకుల చుట్టూ తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమందిని వారం రోజుల పోయిన తరువాత రమ్మనడంతో వృద్ధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయం వద్ద ఇస్తే బాగున్ను..



గత నెల మాదిరిగా సచివాలయంలో ఇచ్చే ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఆరు కిలోమీటర్ల దూరం నుంచి పింఛన్ కోసం కొడుకుని వెంట బెట్టుకొని స్టేట్‌బ్యాంకుకు ఆటోలో వచ్చాను. ఎవరు ఏం చేసినా మాకు ఇబ్బందులు తప్పడం లేదు.

వి. నారాయణమ్మ, టి జంగాలపాలెం, సబ్బవరం మండలం

జ్వరంతో బాంకుకు వచ్చాను..




జ్వరంతో బాధపడుతున్నా పింఛను సొమ్ము కోసం 3 కిలోమీటర్ల నుంచి నడుచుకుంటూ సత్యవరం బాంకుకు వచ్చాను. తీరా బాంకుకు వస్తే ఖాతా మనుగడలో లేదని, వారం రోజుల తరువాత రమ్మంటున్నారు. వారం తరువాత అయినా పింఛను సొమ్ము అందుతుందో లేదో.

గండ్రెడ్డి అప్పారావు, పెదరాంభద్రపురం

కూటమి ప్రభుత్వంతోనే కార్మికులకు మంచి రోజులు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



అనకాపల్లి టౌన్, మే 4 : కూటమి ప్రభుత్వంలోనే దినవేతన కార్మికులకు మంచి రోజులు వస్తాయని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో కలిసి సర్వకామదాంబ పార్కు వద్ద శనివారం భవన నిర్మాణ కార్మికులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో అల్పాహారం తీసుకున్నారు. సమీపంలోని హోటల్‌లో సీఎం రమేశ్ దోసె కాల్చుతూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కార్మికులకు మంచిరోజులు రానున్నాయన్నారు. దాడి రత్నాకర్ మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలు కానున్నాయన్నారు. చంద్రన్న బీమా పథకం పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులందరికీ వర్తింపజేస్తామన్నారు. అలాగే భవన నిర్మాణ బోర్డు పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని బాలాజీ, కోటిపల్లి శ్రీనివాసరావు, ఇంద్రకుమార్, వియ్యపు శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఆడ బిడ్డగా ఆదరించండి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత

కోటవురట్ల, మే 4: మీ ఆడ బిడ్డను ఆదరించండి అంటూ టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. శనివారం తంగేడు, కైలాసపట్నం, కోటవురట్ల, రాట్నాలపాలెం, గ్రామాల్లో వంగలపూడి అనిత ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ.. జగన్మోహన్‌రెడ్డి దళితులకు అన్యాయం చేశారని ఆరోపించారు. జగన్ పాలనలో ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయకుండా దళితుల ఉపాధికి దెబ్బకొట్టారని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, వేచలపు జనార్దన్, సుంకర బాబ్జీ, యండపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ సర్కారుతో విద్యార్థులకు మేలు

నక్కపల్లి, మే 4: రాష్ట్రంలో విద్యార్థులు ఎన్నో కష్టాలు పడుతున్నారని, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల మొత్తాలు బ్యాంకు అకౌంట్లలో పడకపోవడంతో విద్యార్థులు ఎన్నో కష్టాలు పడుతున్నారని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత కుమారుడు నిఖిల్ అన్నారు. శనివారం సాయంత్రం దేవవరంలో బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేశారు. పాయకరావుపేట ఎమ్మెల్యేగా తన తల్లి అనితను, ఎంపీగా బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, కొరిమి సూర్య గణేశ్ పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారికి కండువాలు వేస్తున్న వంగలపూడి అనిత

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్

రాంబిల్లి, మే 4 : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కోరారు. శనివారం ఆయన కూటమి నేతలతో కలిసి మండలంలోని పెదకలవలాపల్లి, వైలోవ, జడ్.చింతువా, కొండవారపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. ఈ ప్రాంతంలో ఎస్ఈజడ్, నేవల్‌బేస్ ప్రాజెక్టులు ఏర్పాటుతో గ్రామాలు, భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన కుటుంబాల వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేని ఏకైక ఎమ్మెల్యే కన్నబాబురాజు అని అన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న తనకు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. విజయకుమార్‌కు మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వి.దినేష్‌బాబు, పప్పల నూకన్నదొర, కారే రాముడు, కలిదిండి రఘురాజు, కర్రి సింహగిరి ప్రసాద్, బద్ది నారాయణరావు, ఎరుపిల్లి చిట్టిబాబు, రంగాల రాజులు, ఎరుపిల్లి అజయ్ పాల్గొన్నారు.



జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు హారతి పడుతున్న మహిళలు

అరాచక ప్రభుత్వాన్ని తరిమేసేందుకు వారం రోజులు శ్రమించండి

- జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, మే 4 : రాష్ట్రంలో వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు కూటమి శ్రేణులు వారం రోజులు శ్రమించాలని జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక సాయినగర్ కాలనీ, గొర్లివానిపాలెం, గంగిరెడ్లకాలనీల్లో శనివారం టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు కూటమి నేతలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రమేశ్‌బాబు మాట్లాడుతూ.. రూ.2.7 లక్షల కోట్లు ప్రజలకు పంచిపెట్టానని చెబుతున్న జగన్‌రెడ్డి పన్నుల రూపంలో ప్రజల నుంచి ఎంత గుంజుకున్నారో చెప్పలేదన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాలన గాడిలో పెట్టే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. తనకు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటేసి గెలిపించాలని కోరారు. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెందుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రధాన సమస్యలు ప్రణాళికాబద్ధంగా పరిష్కరించి, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. జనసేన నాయకుడు బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూటమి నేతలు ఇందలి వెంకటరమణ, గండి వంశీ, టి శేఖర్, అక్కుబాబు, ఎం.మహాలక్ష్మీనాయుడు, గండి దేముడు, కొటాన అప్పారావు, గొర్లి చైతన్య, గండి దేముడుబాబు, బంతికోళ్ల పద్మ, కేవీ రమణ, గడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.



సాయినగర్ కాలనీలో ఎన్నికల ప్రచార సభలో పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తిలో.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తి పరిధిలోని నరవ, కోటనరవ, గవర జగయ్యపాలెం, సత్తివాని పాలెం, జెర్రిపోతులపాలెం, చింతగట్లలో శనివారం పంచకర్ల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక మహిళలు ఆయనకు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు ఒబ్బిన శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైసీపీ దౌర్జన్యకాండ

... మొదటి పేజీ తరువాయి

చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ దశలో పోలీసుల తీరుకు వ్యతిరేకంగా కూటమి కార్యకర్తలు పెద్దఎత్తున స్టేషన్ వద్దకు చేరుకోవడం, గంగాధర్‌కు మద్దతుగా బూడి ముత్యాలనాయుడు కుమారుడు, స్వతంత్ర అభ్యర్థి రవికుమార్, దేవరాపల్లి ఎంపీపీ భర్త కిలపర్తి భాస్కర్ తదితరులు ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

పరామర్శకు వెళ్లిన సీఎం రమేశ్‌పై దాడితో నిరసన

దాడికి గురైన గంగాధర్‌కు బాసటగా నిలవడంతో పాటు బూడి వర్గీయుల దాడిలో ధ్వంసమైన అతని ఇంటిని పరిశీలించేందుకు బూడి మొదటి భార్య కుమారుడు రవి కుమార్‌లతో కలిసి తారువ వెళ్లిన సీఎం రమేశ్‌పై బూడి వర్గీయులు దాడి చేసి, వాహనాన్ని ధ్వంసం చేయడం కలకలం రేపింది. ఈ దశలో పోలీసులు బలవంతంగా సీఎం రమేశ్‌ను పోలీసు వాహనంలో తారువ నుంచి స్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు యత్నించారు. అయితే సీఎం రమేశ్ ఉన్న వాహనాన్ని కదలనీయకుండా బూడి వర్గీయులు అడ్డుకోవడంతో పాటు జీపును ధ్వంసం చేశారు.

దేవరాపల్లిలో ఉద్రిక్తత

బీజేపీ కార్యకర్త గంగాధర్, సీఎం రమేశ్‌పై బూడి వర్గీయుల దాడులు, ఆపై సీఎం రమేశ్ వాహనం ధ్వంసం తదితర ఘటనలతో తారువతో పాటు మండల కేంద్రమైన దేవరాపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను నిరసిస్తూ కూటమి కార్యకర్తలు ఆందోళన చేశారు. డిప్యూటీ సీఎం ఇలాకాలో చోటుచేసుకున్న ఈ సంఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. కాగా ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసులు సీఎం రమేశ్‌ను శనివారం రాత్రి దేవరాపల్లి నుంచి పంపించి వేసినప్పటికీ, బూడి వర్గీయుల చేతిలో దాడికి గురైన వారిపైనే కేసులు నమోదు చేయడానికి యత్నించడాన్ని కూటమి నేతలు తప్పుపడుతున్నారు. ఈ వివాదంలో పోలీసులు ఏకపక్షంగా డిప్యూటీ సీఎంకు మద్దతుగా నిలవడాన్ని సీఎం రమేశ్ తప్పుబట్టారు. వివాదాల నేపథ్యంలో దేవరాపల్లి మండల కేంద్రంలో పోలీసులు భారీగా మోహరించడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయం స్థానికుల్లో నెలకొంది.

సీఎం.రమేశ్‌పై వైసీపీ నేతల దాడి అమానుషం

పాయకరావుపేట, మే 4 : బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌పై మాడుగుల నియోజకవర్గంలో వైసీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ నాయకుడు తోట నగేశ్ అన్నారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ మొట్టమొదటిసారిగా అనకాపల్లి జిల్లాలో రాయలసీమ సంస్కృతికి తీసుకువచ్చారని ఆరోపించారు. ఆ పార్టీ వారికి ఈ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సీఎం.రమేశ్‌పై దాడిచేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, అదేవిధంగా ఎన్నికల కమిషన్ కూడా దీన్ని తీవ్రంగా పరిగణించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు యేజర్ల వినోద్‌రాజు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రవిరాజు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన నాయకులతో దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, మే 4 : కశింకోట వైసీపీ కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. స్థానిక డీవీఆర్ కార్యాలయంలో వేగి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు టీడీపీలోకి చేరగా.. వారికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ కార్యకర్తలంతా ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అమలు చేయబోయే సంక్షేమ పథకాలు గురించి వివరించాలన్నారు.

బదిలీపై వెళ్లిన న్యాయమూర్తికి సత్కారం



న్యాయమూర్తి ప్రదీపను సత్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, మే 4 : స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీపకు బదిలీ కావడంతో శుక్రవారం రాత్రి న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆమెను ఘనంగా సత్కరించారు. న్యాయమూర్తిగా ప్రదీప చేసిన సేవలను పలువురు కొనియాడారు. మొదటి అదనపు తరగతి జడ్జిగా బదిలీపై అనకాపల్లికి వచ్చిన అమర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో న్యాయమూర్తి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి లక్ష్మణ్, కార్యదర్శి సూరా శ్రీనివాస్, సాయిరాం, ప్రభాకర్ పాల్గొన్నారు.

'వైసీపీ నేతలు ప్రజలను భయపెట్టడం సరి కాదు'

కశింకోట, మే 4 : ప్రజలను వైసీపీ నాయకులు భయపెట్టడం సరికాదని సర్వేజన ఐక్యవేదిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు కొరిబిల్లి పరి అన్నారు. శనివారం ఆయన స్థానిక కంచిపాటి వీధిలో ఉన్న డ్రైనేజీలను పరిశీలించారు. కశింకోటను అన్ని విధాలా అభివృద్ధి చేశామని చెప్పుకునే వైసీపీ నాయకులు కొన్ని ప్రాంతాల్లో కనీసం అభివృద్ధి చేయకపోవడం సిగ్గుచేటన్నారు.ఇకపై ఎవరైనా భయభ్రాంతులకు గురి చేసినట్టయితే తమను సంప్రదించాలని చెబుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంచిపాటి శివ, కంచిపేట దివాకర్, ఆడారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదు నిమిషాల్లో మండల సమావేశం పూర్తి

ఎలమంచిలి, మే 4: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కేవలం ఐదు నిమిషాల్లో ముగించేశారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా తీర్మాణాలు చేయడం జరగదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఎస్.ఉమ, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పీవో, ఏపీవోల శిక్షణ ప్రారంభం

ఎలమంచిలి, మే 4: నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించే పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం రిటర్నింగ్ అధికారి మనోరమ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుపాటు నిర్వహించే ఈ శిక్షణలో తొలిరోజు ఎన్నికల సిబ్బంది అందరికీ ఆర్వో పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అంతా ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్స్ వీవీప్యాట్, ఈవీఎంలపై అవగాహన కల్పించడంతో పాటు ఎన్నికల రోజు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఎన్నికల ముందు రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి కార్యాలయం ప్రారంభం



కూటమి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం.రమేశ్ భార్య శ్రీదేవి

పాయకరావుపేట, మే 4 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యాలయాన్ని పాయకరావుపేటలో శనివారం ప్రారంభించారు. స్థానిక పాత పంచాయతీ కార్యాలయం ఎదుట అద్దె భవనంలో ఈ కార్యాలయాన్ని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ భార్య శ్రీదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత తనయుడు నిఖిల్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు గూటూరు శ్రీనివాసరావు, బొంది కాశీవిశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల తరుపున ముమ్మర ప్రచారం

పరవాడ, మే 4 : కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శనివారం స్థానిక ఊర చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కూటమి నాయకులు అభ్యర్థించారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేసి పంచకర్ల రమేష్‌బాబును, కమలం గుర్తుపై ఓటు వేసి సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, పైలా రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా బుజ్జి టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలి

పరవాడ, మే 4: గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల సంయోధకులు మల్లిమడుగుల నాగ పేర్రాజు కోరారు. శనివారం స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయాల్లో ప్రతి రోజు భజన, సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు వానపల్లి అప్పలరాజు, ఎం.రాజునాయుడు, పి.లోవరాజు, టి.రమణాజీ, వి.అప్పారావు పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

గొలుగొండ మండలంలో భారీ వర్షం


కృష్ణాదేవిపేట బస్‌స్టేషన్‌లో నిలిచిన వర్షపునీరు

కృష్ణాదేవిపేట, మే 4 : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కుండపోతగా వాన పడింది. దీంతో ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా నీరే కనిపించింది. మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో వర్షపు నీరు ఎటూ పోలేని స్థితిలో గొల్ల వీధి, వినాయక వీధి, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్డుపై మురుగు నీటితో కలిసి ప్రవహించింది. అలాగే కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను వర్షపునీరు ముంచెత్తింది.


ఏఎల్‌పురం వినాయక వీధి రోడ్డుపైకి చేరిన నీరు

బీసీ కాలనీ కాలువల్లో మురుగు తిష్ట


కాలువలో చెత్తాచెదారం

మాకవరపాలెం, మే 4 : ఇక్కడి బీసీ కాలనీలోని కాలువల్లో పూడిక పేరుకుపోయింది. వాడుక నీరు ముందుకు సాగే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో ఓ వైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడద అధికంగా ఉందని నివాసితులు వాపోతున్నారు. దీనికితోడు కల్వర్టు వద్ద మట్టి పెరిగిపోవడంతో మురుగు రోడ్డు పైనుంచి పారుతున్నట్టు చెపుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కాలువల్లో పూడిక తొలగించాల్సిందిగా కాలనీవాసులు కోరుతున్నారు.

మోసకారి జగన్‌ను ఇంటికి పంపించండి

▸ వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం ▸ చంద్రబాబుతోనే మళ్లీ మంచి రోజులు

▸ కేపీఎల్‌పురం పంచాయతీ నగరం గ్రామ ఎన్నికల ప్రచారంలో అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, మే 4 : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో అంతా ఇంటికి పంపించాలని మాజీ మంత్రి, నర్సీపట్నం నియోజకవర్గ కూటమి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కేఎల్‌పురం పంచాయతీ శివారు నగరం గ్రామంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. మళ్లీ ఆంధ్రాకు మంచి రోజులు రావాలన్నా, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలన్నా చంద్రబాబు వంటి సమర్థుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. జడ్పీటీసీ సుకల రమణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగ స్వామి, వేములపూడి ఎంపీటీసీ బోళెం రాంప్రసాద్, నగరం గ్రామ టీడీపీ నాయకులు జీవీ రాజమల్లు, రాజబాబు, దొరబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 18వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భర్త మోహన్


కౌన్సిలర్ శెట్టి విజయాంబ భర్త మోహన్‌కు పార్టీ కండువా కప్పుతున్న అయ్యన్న

నర్సీపట్నం : మునిసిపాలిటీ పరిధి 18వ వార్డు వైసీపీ కౌన్సిలర్ శెట్టి విజయాంబ భర్త మోహన్ శనివారం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో టీడీపీలో చేశారు. 'వస్తున్నా మీ కోసం పాదయాత్ర'లో భాగంగా అయ్యన్నపాత్రుడు బలిఘట్టం, బయపురెడ్డి పాలెంలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బలిఘట్టం సీనియర్ వైసీపీ నాయకుడు, ఆ వార్డు కౌన్సిలర్ భర్త శెట్టి మోహన్ వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో ఆయనకు అయ్యన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో తొమ్మిది రోజుల్లో రాష్ట్రానికి పట్టిన పీడ విరగడైపోతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు ఎంతో నష్ట పోయారని, చేతకాని ముఖ్యమంత్రిని దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రజలు అన్నికాలలుగా సుభిక్షింగా ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పార్టీ పట్టణ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం లింగంపేటలో వైసీపీ నుంచి పలువురు శనివారం టీడీపీలో చేరారు. వీరికి మాజీ మంత్రి అయ్యన్న సతీమణి పద్మావతి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, టీఎస్ఎన్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గోలకొండ శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు సత్యనారయణ, అప్పలనాయుడు, నాయకులు రమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

▸ పీవోలు, ఏపీవోల శిక్షణలో ఆర్వో జయరాం


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆర్వో జయరాం

నర్సీపట్నం, మే 4 : ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని నర్సీపట్నం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ జయరాం సూచించారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ మండలాల్లో ఎన్నికల నిర్వహణకు నియమితులైన 286 మంది పీవోలు, ఏపీవోలకు శనివారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో అనుక్షణం అప్రమత్తత అవసరమన్నారు. జిల్లా ఎన్నికల శిక్షణ విభాగం నోడల్ అధికారులు జయంతి, నాగలక్ష్మిలు ఈ తరగతులను పరిశీలించారు. అనంతరం ఈవీఎంలు కమిషనింగ్ జరిపారు. ఎమ్మెల్యే ఎన్నికలకు సంబంధించిన మూడొందల బ్యాలెట్ పత్రాలను అర్పారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్ పత్రాలు రావాల్సి ఉంది.

గర్భిణుల ఘోష!

▸ నాతవరం పీహెచ్‌సీలో రాత్రివేళ అందని అత్యవసర వైద్య సేవలు ▸ స్థానికంగా ఉండని వైద్యులు

▸ పురిటి నొప్పులతో దూర ప్రాంతం నుంచి వచ్చే వారికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలింపు

▸ సకాలంలో వైద్యం అందక జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని పలువురు ప్రశ్న


నాతవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నాతవరం, మే 4 : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు పనిచేస్తుండగా, వీరు స్థానికంగా నివాసం ఉండకుండా దూరప్రాంతాల నుంచి విధులకు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వివిధ గ్రామాల నుంచి రాత్రి వేళ పురిటి నొప్పులతో బాధపడుతూ వచ్చే గర్భిణుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. మండల కేంద్రానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న సుందరకోట, అసనగిరి తదితర గిరిజన గ్రామాల నుంచి గర్భిణులు రాత్రివేళలో పురిటినొప్పులతో ప్రైవేటు వాహనాల ద్వారా ఈ పీహెచ్‌సీకి వస్తున్నారు. ఆ సమయంలో వైద్య సిబ్బంది గర్భిణులకు వైద్య సేవలు అందించకుండా, వైద్యులు లేరని చెపుతూ ఇక్కడికి మరో ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించాల్సిందిగా సూచిస్తున్నారని పలువురు వాపోతున్నారు. అసలే కొండకోనల్లో పేదరికంలో మగ్గే తమకు ఇది మరింత ఇబ్బంది మారుతోందని అంటున్నారు. అంతేకాకుండా గర్భిణులకు అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందక జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. ఓవైపు ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయించుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని, ఇలా ఆస్పత్రికి వస్తే వైద్యులు అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి పీహెచ్‌సీలో వైద్యులు స్థానికంగా ఉండక ఎదురవుతున్న ఇబ్బందుల విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్‌ను వివరణ కోరాగా, డాక్టర్లు స్థానికంగా ఉంటున్నదీ లేనిదీ తెలుసుకుంటామన్నారు. అలాగే నాతవరం పీహెచ్‌సీకి దూర ప్రాంతాలైన సుందరకోట, అసనగిరి తదితర గ్రామాల నుంచి రాత్రివేళల పురిటినొప్పులతో వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

జగనాసుర పాలనను...

... మొదటి పేజీ తరువాయి

బాలకృష్ణ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రజా ధనాన్ని దోచుకున్నారన్నారు. ఈ రావణ జగనాసురుడిని ఈ ఎన్నికల్లో ఓటు ఆయుధంతో అంతమొందించకుంటే తెలుగుజాతి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పొదుపుతో డ్వాక్రా మహిళలు ప్రపంచ ఖ్యాతి పొందేలా చంద్రబాబు తీర్చిదిద్దితే..నేడు జగన్‌రెడ్డి తెలుగు గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరిపై రూ.5 లక్షల అప్పు చేశాడన్నారు. అభివృద్ధిని విస్మరించి, ప్రతిపక్షాలపై అక్రమ కేసుల బనాయింపుతోనే ఐదేళ్లు గడిపేశారన్నారు. రైతులను, యువతను, నిరుద్యోగులను మోసం చేశారని బాలకృష్ణ ఆరోపించారు. చివరకు తల్లి, చెల్లికి కూడా అన్యాయం చేశారన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీల కోసం అమలు చేసిన 25 పథకాలను రద్దు చేశారన్నారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలను మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. ఏ గ్రామంలోనైనా ఒక సీసీ రోడ్డు అయినా నిర్మించారా?...అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్యకు నోచుకోకుండా చేశారన్నారు. అవన్నీ మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే సాకారం అవుతాయన్నారు. జగన్ పాలనలో ఇబ్బందులు, అక్రమ కేసులకు గురైన వారికి త్వరలో మంచిరోజులు రానున్నాయన్నారు. ఎన్నికల్లో ఎంపీగా సీఎం రమేశ్‌ను, చోడవరం ఎమ్మెల్యేగా కేఎస్ఎన్ఎస్ రాజును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, టీడీపీ నేత గూనూరు మల్లునాయుడు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, గల్లా రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దౌర్జన్యకాండ

... మొదటి పేజీ తరువాయి

చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ దశలో పోలీసుల తీరుకు వ్యతిరేకంగా కూటమి కార్యకర్తలు పెద్దఎత్తున స్టేషన్ వద్దకు చేరుకోవడం, గంగాధర్‌కు మద్దతుగా బూడి ముత్యాలనాయుడు కుమారుడు, స్వతంత్ర అభ్యర్థి రవికుమార్, దేవరాపల్లి ఎంపీపీ భర్త కిలపర్తి భాస్కర్ తదితరులు ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

పరామర్శకు వెళ్లిన సీఎం రమేశ్‌పై దాడితో నిరసన

దాడికి గురైన గంగాధర్‌కు బాసటగా నిలవడంతో పాటు బూడి వర్గీయుల దాడిలో ధ్వంసమైన అతని ఇంటిని పరిశీలించేందుకు బూడి మొదటి భార్య కుమారుడు రవికుమార్‌లతో కలిసి తారువ వెళ్లిన సీఎం రమేశ్‌పై బూడి వర్గీయులు దాడి చేసి, వాహనాన్ని ధ్వంసం చేయడం కలకలం రేపింది. ఈ దశలో పోలీసులు బలవంతంగా సీఎం రమేశ్‌ను పోలీసు వాహనంలో తారువ నుంచి స్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు యత్నించారు. అయితే సీఎం రమేశ్ ఉన్న వాహనాన్ని కదలనీయకుండా బూడి వర్గీయులు అడ్డుకోవడంతో పాటు జీపును ధ్వంసం చేశారు.

దేవరాపల్లిలో ఉద్రిక్తత

బీజేపీ కార్యకర్త గంగాధర్, సీఎం రమేశ్‌పై బూడి వర్గీయుల దాడులు, ఆపై సీఎం రమేశ్ వాహనం ధ్వంసం తదితర ఘటనలతో తారువతో పాటు మండల కేంద్రమైన దేవరాపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను నిరసిస్తూ కూటమి కార్యకర్తలు ఆందోళన చేశారు. డిప్యూటీ సీఎం ఇలాకాలో చోటుచేసుకున్న ఈ సంఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. కాగా ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసులు సీఎం రమేశ్‌ను శనివారం రాత్రి దేవరాపల్లి నుంచి పంపించి వేసినప్పటికీ, బూడి వర్గీయుల చేతిలో దాడికి గురైన వారిపైనే కేసులు నమోదు చేయడానికి యత్నించడాన్ని కూటమి నేతలు తప్పుపడుతున్నారు. ఈ వివాదంలో పోలీసులు ఏకపక్షంగా డిప్యూటీ సీఎంకు మద్దతుగా నిలవడాన్ని సీఎం రమేశ్ తప్పుబట్టారు. వివాదాల నేపథ్యంలో దేవరాపల్లి మండల కేంద్రంలో పోలీసులు భారీగా మోహరించడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయం స్థానికుల్లో నెలకొంది.

చోడవరం నియోజకవర్గం

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట, మే 4: మండలంలో కోమళ్లపూడి, గంటికొర్లాం, బుదిరెడ్డిపాలెం, పొట్టిదొరపాలెం, కొండెంపూడి, కె.పీ.అగ్రహారం గ్రామాల్లో శనివారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుందుకు గాను ఈ మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

నిప్పుల కుంపటి


నిర్మానుష్యంగా ఉన్న రావికమతం మెయిన్ రోడ్డు

రావికమతం, మే 4: గత రెండు వారాలుగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే భానుడు నిప్పుల కుంపటిలా భగభగమంటున్నారు. దీంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత రెండు వారాలుగా పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. దీనికి వడగాల్పులు తోడయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు వేడిగాలుల ధాటికి గర్భిణులు, పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం. ఉదయం పది గంటలు దాటాక చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారు. దీనికితోడు విద్యుత్ కోతలతో ఉక్కపోతను భరించలేకపోతున్నామని జనాలు గగ్గోలు పెడుతున్నారు. రైతులు,ఉపాధి కూలీలు ఎండ తీవ్రతను భరించలేక పది గంటలకే పనులనుంచి ఇంటిదారి పడుతున్నారు. శనివారం 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మాడుగుల రూరల్: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిప్పుల కొలిమిని తలిపించేలా ఉంది. మరో వైపు ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. మధ్యాహ్నం జనసంచారం లేక రోడ్లు, జంక్షన్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండల ధాటికి తట్టుకుని ప్రయాణాలు సాగించడం చాలా కష్టతరంగా ఉందని పలువురు చెబుతున్నారు.

సారా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

బుచ్చెయ్యపేట, మే 4: ఆర్. చినభీమవరంలో గొంతిన నాగేశ్వరరావునుశనివారం అరెస్టు చేసి, ఎనిమిది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు.

మంటలు.. మంటలు.. మోగని గంటలు

▸ మరమ్మతుల పేరిట రావికమతంలో అగ్నిమాపక శకటం తరలింపు

▸ వరుస అగ్ని ప్రమాదాలు.. నియంత్రణ శూన్యం



అగ్నిమాపక శకటంలేక ఖాళీగా ఉన్న అగ్నిమాపక కేంద్రం

రావికమతం, మే 4: మరమ్మతుల పేరిట స్థానిక రావికమతం (గర్నికం) అగ్నిమాపక కేంద్రంలోని శకటాన్ని కాంట్రాక్టర్ తరలించి తిరిగి తీసుకురాకపోవడంతో అగ్నిమాపక సేవలు గత నెల రోజులుగా నిలిచిపోయాయి. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు అగ్ని ప్రమాదాలు అధికమవుతున్నాయి. గత నెల రోజులుగా జరిగిన అగ్రి ప్రమాదాల్లో రైతులు పంటలను తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక్కడ అగ్నిమాపక కేంద్రం అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 2007లో ఏర్పాటు చేశారు. ఒక శకటంతోపాటు 16 మంది కాంట్రాక్ట్ పద్ధతిన సిబ్బందిని నియమించారు.

మూడు మండలాలకు ఈ కేంద్రమే ఆధారం

దీని ద్వారా రావికమతం, బుచ్చియ్యపేట, రోలుగుంట మూడు మండలాల్లో 40 గ్రామ పంచాయతీల పరిధిలో సేవలందిస్తున్నారు. ఈ పరిధిలో ఎక్కడ ప్రమాదాలు సంభవించినా సమాచారం అందిన క్షణాల్లోనే సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని నివారణ చర్యలు చేపడుతున్నాయి. ఈ కేంద్రానికి ప్రమాదాల నివారణకు లారీ ట్యాంకులోనికి అవసరమైననీటికి కేంద్రంలో బోరు బావిలేకున్నా సిబ్బంది రైతుల పొలాల్లో బావులు, గెడ్డల్లోనూ నీటిని నింపుకుంటూ ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నారు. అలాగే, సకాలంలో సిబ్బందికి వేతనాలు ఇవ్వకున్నా సేవలందించడంలో ఇక్కడ సిబ్బంది జిల్లాలోనే మేటిగా నిలుస్తున్నారు. వర్షాకాలంలో వాహన మరమ్మతులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే వేసవిలో మరమ్మతు పేరుతో వాహనాన్ని తరలించుకుపోయి నెలల తరబడి గడపడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ మూడు మండలాల పరిధిలో రోజుకు ఐదారుకు పైగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నా వాహనంలేక అగ్నిమాపక సేవలకు సిబ్బంది మోహం చాటేస్తున్నారు. దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఎండలకు గండి వాములు, పశువుల పాకలు, జీడిమామిడి, నీలగిరి, సరుగుడు తోటల్లో ప్రమాదాలు తరచూ జరిగి భారీ నష్టాలు జరుగున్నాయి. దూరాన ఉన్న చోడవరం, మాడుగుల, నర్సీపట్నం కేంద్రాలకు సమాచారమిస్తున్నా ఆ సమయంలో అయా మండలాల్లో జరిగే ప్రమాదాల నివారణలో ఉండటంతో ఆ సిబ్బంది రాలేకపోతున్నారు. ఒక వేళ వచ్చినా అప్పటికే ఘటనా స్థలంలో అంతా కాలిబూడదవుతోంది. అగ్నిమాపక వాహనానికి డీజిల్ ఖర్చు తగ్గించుకోవడానికి మరమ్మతు పేరుతోకాంట్రాక్టర్ తరలించారనే పలువురు ఆరోపిస్తున్నారు. సిబ్బందిని వివరణ కోరగా.. రెండు మూడు రోజుల్లో మరమ్మతు పూర్తయివాహనం వస్తుందని చెప్పారు.

మూడో రోజూ ముప్పుతిప్పలే..

▸ పింఛన్‌దారులకు అవస్థలు


రోలుగుంట ఏపీజీవీ బ్యాంకు వద్ద లబ్ధిదారులు

రోలుగుంట, మే 4 : పింఛన్‌దారులకు మూడో రోజు కూడా కష్టాలు తప్ప లేదు. పింఛన్‌సొమ్ము కోసం శనివార బ్యాంకులకు పెద్దఎత్తున తరలివెళ్లి అవ స్థలు పడ్డారు.స్థానిక ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద ఉదయం 8 గంటల నుంచే పడిగాపులు కాశారు. ఇంటింటికీ పంపిణీ చేయడానికి సి బ్బంది తగినంత మంది ఉన్నా జగన్ ప్రభుత్వం కావాలనే తమను ఇ బ్బందులకు గురిచేస్తోందని పలువురు వృద్ధులు తెలిపారు. మండే ఎండల్లో పింఛన్‌దారులను బ్యాంకుల చుట్టూ తిప్పుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతోందని వాపోయారు. మండలంలోని అధిక సంఖ్యలో వృద్ధులు నాలుగైదేళ్లనుంచి బ్యాంకు ఖాతాలు వాడుకలోలేవు. కొందరివి బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ కాలేదు. దీంతో వాటిని సరిచేసుకోవడానికి వృద్ధులు బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తి రుగుతున్నారు. మరికొంత మందికి ఖాతా ఉన్నా పింఛన్ సొమ్ము జమకాలేదు.

తిరుగున్నా ఫలితం కనపడలేదు..



పింఛన్ కోసం ఎప్పటిలాగే ఈ సారీ సచివాలయానికి వెళితే ఇక్కడ కాదు బ్యాంకు వెళ్లి వెళ్లాలన్నారు. అక్కడ ఖాతా చూసి ఇంకా పింఛన్ డబ్బు పడలేదని బ్యాంక్ సిబ్బంది చెబుతున్నారు.మూడురోజులుగా సచివాలయానికి,బ్యాంకుకు తిరుగుతున్నా. ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.కూలిపనులకు ఇతర ప్రాంతానికి వెళ్లాను,పింఛన్ కోసం వస్తే ఇవీ ఇబ్బందులు.

- సుర్ల శ్రీరాములు, పింఛన్‌దారు, కొమరవోలు

సిబ్బంది సమన్వయ లోపం.. రోగులకు శాపం

▸ మాడుగుల సీహెచ్‌సీలో పరిస్థితి

▸ సమయానికి రాని సిబ్బంది..


మాడుగుల సామాజిక ఆరోగ్య కేంద్రం


ఉదయం 9:30కు ఖాళీగా ఉన్న సిబ్బంది కుర్చీ

మాడుగుల, మే 4: అన్ని వసతులున్నా వైద్య సేవలందించడంతో మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రి వెనుకంజలోనే ఉంటోంది. ఈ ఆస్పత్రిపై జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరి తీరుతో ఆస్పత్రిలో వైద్యులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య వైద్య విధాన పరిషత్)లో దంత వైద్యులు, గైనికాలజిస్ట్ మినహా పూర్తిస్థాయి వైద్యులతోపాటు, సిబ్బంది ఉన్నారు. అయితే కొంతమంది మినహా మిగిలిన వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్నారు. ఈ ఆస్పత్రిలో నర్సులు, స్టాఫ్‌నర్స్‌లకు రోస్టర్ విధానంలో విధులు నిర్వహించాలి. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది మధ్య సమన్వయం లోపంతో వైద్యులు విధులకు ముందుగా హాజరవుతున్నా, సిబ్బంది మాత్రం వారికి నచ్చిన సమయానికి వస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలస్యంగా వస్తున్న సిబ్బందిని వైద్యులు మందలించాలనుకున్నా, మీరు మా లానే వస్తున్నారంటూ వైద్యులను ప్రశ్నించే పరిస్థితి నెలకొంది. సిబ్బందికి రోస్టర్ విధానంలో డ్యూటీలు వేసే ప్రధాన ఉద్యోగి దీని వెనుక సూత్రధారిగా వ్యవహరిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. ఆ ఉద్యోగి తాను చెప్పినట్టు వినకుండా వైద్యులకు అనుకూలంగా పనిచేస్తే దూర ప్రాంతాల నుంచి విధులకు వచ్చే వారికి నైట్ షిఫ్టుల్లోకి మార్చేస్తానని బెదిరించడమే కాకుండా, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరికలు జారీచేస్తున్నట్టు కొంతమంది సిబ్బంది వాపోతున్నారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు భయపడి ఉదయం 9గంటలకు ఆస్పత్రికి చేరుతున్న రోగులకు వైద్యమందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నా, ఓపీ రాయడానికి, బీపీ తనిఖీలు, రక్తపూతలు సేకరించడంతో పాటు ఇంజెక్షన్ చేసేందు ఒకరిద్దరు తప్ప మిగిలిన సిబ్బంది స మయానికి రావడం లేదు. 9.45నిమిషాల వరకు ఇదే పరిస్థితి. దీనిపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొరపాట్లు సరిదిద్దుతా.. ఆస్పత్రి సూపరింటెండెంట్

అయితే ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ని వివరణ కోరగా, అందరూ ఒకేలా ఉండరని, ఒక్కొక్కరు ఒక్కోలా వ్యవహరిస్తారని, అలాంటి విషయాలు బయట పెట్టలేమని బదులిచ్చారు. పొరపాట్లు సరిదిద్దిరోగులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోస్టర్ విధానంలో సిబ్బంది విధులుసమయానికి వస్తున్నారన్నారు.

మాడుగుల నియోజకవర్గం

వడదెబ్బపై అప్రమత్తం


మాడుగుల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్

మాడుగుల, మే 4: ప్రస్తుతం ఎండల దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మాడుగుల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, 50ఏళ్లు పైబడిన వారు వివిధ పనులపై వెళ్తే ఉదయం 11గంటలకు తిరిగి ఇళ్లకు చేరుకునేలా జాగ్రత్త పడాలన్నారు. అలాగే గర్భిణులు, చిన్న పిల్లలు ఎండలోకి వెళ్లరాదని అన్నారు. అదే విధంగా వదులు గా ఉన్న తెల్లని కాటన్ దుస్తులు ధరించి, నెత్తిపై టోపీ పెట్టుకోవాలని, అవసరమైతే మొహానికి క్లాత్ మూసుకోవాలని సూచించారు. రోజుకి ఐదు లీటర్లకు పైగా నీరు తాగాలన్నారు. అలాగే మసాల వా డకం తగ్గించాలని, ఆరు బయటకు వెళ్లిన సమయంలో జ్యూస్, ఐస్‌వాటర్ కాకుండా, కొబ్బరినీరు తీసుకోవాలని కోరారు. వడదెబ్బ బారిన పడినవారికి సమీపంలో ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు.

చుక్కపల్లిలో వైద్య సేవలు


రోగులకు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి తరుణ

చీడికాడ, మే 4: చుక్కపల్లి గ్రామంలో 150మంది రోగులకు డా.తరుణ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా శనివారం గ్రామ ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన ఈ శిబిరంలో తనిఖీలు చేసిన వారిలో ఇద్దరు మహిళలు రక్తహీనతతో ఉండటంతో పెదగోగాడ పీహెచ్‌సీకి రిఫర్ చేశామని ఆమె తెలిపారు. ముఖ్యంగా వేసవికాలం ముగిసేవరకూ ఎండలో తిరగకుండా ప్రతిరోజు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనంతరం వీరందరికీ మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హెచ్‌వి శకుంతల, ఎంఎల్‌హెచ్‌పి కోమలి, ఏఎన్ఎం శాంతి, హెల్త్ అసిస్టెంట్‌కుమార్, ఆశవర్కర్‌లు సేవలు అందించారు.

గాలి వాన


విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న లైన్‌మన్ అక్కునాయుడు

చీడికాడ, మే 4: మండలంలోని మంచాల, కోనాం, శిరిజాం పంచాయతీలతోపాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం గాలితోకూడిన వర్షం కురిసింది. దీంతో ఎస్ఎన్‌పురంలో విద్యుత్‌స్తంభం, మంచాల బోనెవారి కళ్లాల వద్ద రెండు స్తంభాలు నేలకొరిగాయి. వర్షంకన్నా ఈదురుగాలి ఎక్కువకావడంతో చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. విరిగిపడిన స్తంభాలను లైన్‌మన్ అక్కునాయుడు పరిశీలించారు. శిరిజాం, మంచాల పం చాయతీలకు రాత్రంతా విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులకు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.